ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



అనకాపల్లి
జిల్లా వార్తలు
శుక్రవారం 19 సెప్టెంబరు 2025

22న సీఎం రాక



విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 22వ తేదీన నగరానికి రానున్నారు. నోవాటెల్ హోటల్‌లో జరగనున్న ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సులో ఆయన పాల్గొంటారు. వివిధ రాష్ట్రాల ఐటీ మంత్రులు, ఉన్నతాధికారులతో పాటు ఐటీ, ఎలక్ట్రానిక్స్ నిపుణులు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఇంకా అధికారికంగా షెడ్యూల్ విడుదల కావలసి ఉంది.

రహదారులు ఛిద్రం!

కూటమి ప్రభుత్వం హయాంలో రోడ్లకు మరమ్మతులు
ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న గ్రామీణ రోడ్లు

- అధ్వానంగా మారిన వైనం
- ఆర్‌అండ్‌బీ రోడ్ల దుస్థితి అంతే..
- వాహనదారుల సహనానికి పరీక్ష

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రహదారుల అభివృద్ధి మూన్నాళ్ల ముచ్చటగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధ్వాన రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఈ రోడ్లకు మరమ్మతులు చేయించింది. రహదారులు బాగుపడ్డాయనే ఆనందం జిల్లావాసులకు ఎంతో కాలం లేదు. ఇటీవల కురిసిన వర్షాలు రోడ్లను ఛిద్రం చేశాయి. ఫలితంగా రోడ్లపై గోతులు ఏర్పడ్డాయి. ప్రయాణికులకు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి.



మాడుగుల మండలం ఎం.కోడూరులో రోడ్డు దుస్థితి



కశింకోట మండలం తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలు



రోలుగుంట మండలం అర్ల పంచాయతీలో ఇటీవల వేసిన రోడ్డు వర్షాలకు ఇలా...

రాష్ట్ర వ్యాప్తంగా గుంతలు లేని రహదారులే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ఆధ్వర్యంలో నిర్వహణ పనులు చేపట్టారు. జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో 1,100 కిలోమీటర్ల పొడవున రోడ్లు ఉన్నాయి. తొలి దశలో గత మార్చి నెలలో 109 పనులకు రూ.8.8 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో 521.32 కిలోమీటర్ల పొడవు గల ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కన్వర్జెన్సీ నిధులు 181.22 కోట్లతో రహదారులకు మరమ్మతులు చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా 229 కిలోమీటర్ల పొడవున సిమెంట్, బీటీ రోడ్లను నిర్మించారు. కానీ ప్రజలకు రోడ్లు బాగుపడ్డాయనే ఆనందం ఎంతకాలం లేకుండా పోయింది. ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామీణ రోడ్లు, వంతెనలు ఛిద్రమయ్యాయి. గతంలో అధ్వాన్నంగా ఉన్న రోడ్లు మరింత దయనీయం కాగా, కొన్ని మండలాల్లో రోడ్లపై పూడ్చిన గుంతలు మళ్లీ ఏర్పడ్డాయి. దీంతో అనకాపల్లి నుంచి గ్రామీణ ప్రాంతంలోని మండల కేంద్రాలకు రాకపోకలు సాగించాలంటే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇదీ.. రోడ్ల సం'గతి'...

అనకాపల్లి నుంచి వయా బలువువాడ, మామిడిపాలెం, వెంకన్నపాలెం మీదుగా చోడవరం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. రోలుగుంట మండలం అర్ల పంచాయతీ నుంచి ప్రతిగడ్డ గిరిజన గ్రామానికి 6 కిలోమీటర్లు ఉపాధి నిధులతో వేసిన రోడ్డులో మూడు కిలోమీటర్ల మేర కొట్టుకుపోయింది. కశింకోట మండలం తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో భారీ గుంతలు రెండు నెలల కిందటే పూడ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. సబ్బవరం నుంచి వయా

... మిగతా 8వ పేజీలో

అన్న క్యాంటీన్లు అదుర్స్

పునఃప్రారంభమై ఏడాది పూర్తి

- జిల్లాలో 9,75,036 మంది పేదలకు ఆకలి తీర్చిన ప్రభుత్వం
- రూ.5లకే టిఫిన్, భోజనం



ప్రజలకు భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ల్లో ఏడాది కాలంలో లక్షల మంది పేదలు ఆకలి తీర్చుకున్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు బడుగు, బలహీన వర్గాలకు కిలో రూ.2లకే బియ్యం పంపిణీ చేపట్టారు. అలాగే గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి రూ. 5లకే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓటమి చెందడంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను రద్దు చేసింది. గత ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 2024 సెప్టెంబరు 19వ తేదీన అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించింది. ఈ క్యాంటీన్లు ప్రారంభమై శుక్రవారానికి ఏడాది పూర్తయింది. జిల్లాలోని అనకాపల్లి పట్టణంలో ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వేస్టేషన్ల వద్ద, నర్సీపట్నంలో ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద, ఎలమంచిలి తహశీల్దార్ కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నాటి నుంచి నేటి వరకు జిల్లా వ్యాప్తంగా 9,75,036 మంది అన్న క్యాంటీన్ల ద్వారా ఆకలి తీర్చుకున్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద గల అన్న క్యాంటీన్‌లో 2,53,560 మంది ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి

... మిగతా 8వ పేజీలో



భోజనాలు తింటున్న ప్రజలు

పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఫలితాలు

హెచ్‌ఎం, టీచర్లకు ఆర్‌జేడీ విజయ భాస్కర్ నిర్దేశం

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి
- విద్యార్థుల్లో పరీక్ష అంటే భయం లేకుండా చేయండి



హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయ భాస్కర్

నక్కపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో అన్ని పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఆర్‌జేడీ బి విజయ భాస్కర్ నిర్దేశం చేశారు. గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో పలు హైస్కూళ్ల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టెన్త్‌లో ప్రతిభావంతులైన వారినే కాకుండా, కొన్ని సబ్జక్టుల్లో వెనుకబడిన వారిని గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. విద్యార్థులకు పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించేందుకు టీచర్లు వారితో స్నేహపూర్వక వాతావరణంలో విద్యాబోధన చేయాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు కూడా తాము

... మిగతా 8వ పేజీలో

డ్రగ్స్ రహిత జిల్లాగా అనకాపల్లి

కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

- పాఠశాలలు, బస్టాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి
- ప్రధాన రహదారుల పక్కనున్న భూములను గుర్తించండి
- మునగాకు ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రైమ్ రేటు తగ్గేలా చర్యలు తీసుకోవాలని, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశమందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ పాఠశాలలు, బస్టాపుల వద్ద అసభ్య ప్రవర్తన జరగకుండా హాట్ స్పాట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామంలో ఆకతాయిల బెడద లేకుండా సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. గంజాయి, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని విభాగాలు కృషి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు సూక్ష్మ సేద్యం నిధులను పూర్తిగా వినియోగించుకోవాలని, పశు సంవర్థక శాఖ ప్రతిపాదనలను మండల వారీగా షేర్ చేయాలని, జాతీయ రహదారులకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. గ్రామాల్లో మునగచెట్ల పెంపకం, మునగ ఆకుల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. దోబీ ఘాట్లకు ఆధునిక వసతులు, బ్యాంక్ లింకేజి కల్పించాలని, నైపుణ్యాభివృద్ధి శాఖ ద్వారా

... మిగతా 8వ పేజీలో

రైల్వే పనులు త్వరితగతిన పూర్తి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

- లక్ష్మీదేవిపేట ఫ్లైఓవర్, ప్లాట్‌ఫారాల పనులు పరిశీలన
- ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పనులు చేయాలి



రైల్వేస్టేషన్‌లో వెయింటింగ్ హాల్ పనుల వివరాలపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

- 8లో

రబీ సీజన్‌లో రూ.340 కోట్ల రుణాలు

'ఆంధ్రజ్యోతి'తో డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు

- ఖరీఫ్‌లో ఇప్పటివరకూ రూ.272 కోట్లు
- క్రాప్ లోన్ ఒక్కొక్కరికీ రూ.3 లక్షలు, 4 శాతం వడ్డీ సకాలంలో రుణం చెల్లిస్తే వడ్డీ మాఫీ
- సొంత అవసరాలకు రూ.ఆరు లక్షల వరకూ రుణం
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.మూడు వేల కోట్ల వ్యాపార లక్ష్యం
- స్వయంశక్తి సంఘాలకు కూడా రుణాలు

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):



కోన తాతారావు

వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న రబీ సీజన్‌లో రైతులకు రూ.340 కోట్లు పంట రుణాలుగా ఇచ్చేందుకు నిర్ణయించినట్టు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకూ రూ.272 కోట్లు అందజేశామన్నారు. ఆయన గురువారం తన ఛాంబర్‌లో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో గల 98 సొసైటీల పరిధిలో 4.56 లక్షల మంది రైతులు ఉన్నారని, పంట రుణం కింద ఒక రైతుకు రూ.మూడు లక్షల వరకూ మంజూరుచేస్తామన్నారు.

రుణాల మంజూరుకు గత ప్రభుత్వంలో ఉన్న షరతులు ప్రస్తుతం సడలించినట్టు తాతారావు తెలిపారు. రైతులు ఏ పంట సాగు చేసినా రుణాలు మంజూరుచేస్తున్నామన్నారు. ఏజెన్సీలో పసుపు, కాఫీ, చింత, ఇతర ఉద్యానవన పంటలకు రుణాలు ఇస్తున్నామని వివరించారు. పాయకరావుపేట ప్రాంతంలో తమలపాకు సాగుచేసే రైతులకు ఎకరాకు రూ.లక్ష రుణం అందజేస్తున్నామని వెల్లడించారు. కేవలం నాలుగు శాతం వడ్డీతో ఇచ్చే పంట రుణాలను సకాలంలో చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొత్తం వడ్డీ మాఫీ చేస్తున్నాయని పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయం, సొంత అవసరాల కోసం ఇచ్చే స్వల్పకాలిక రుణాల పరిమితి రూ.ఐదు లక్షల నుంచి రూ.ఆరు లక్షలకు పెంచామన్నారు. దీనిని రూ.10 లక్షలకు పెంచాలని ప్రతిపాదించామని తాతారావు చెప్పారు.

బ్యాంకు వ్యాపార అభివృద్ధిలో భాగంగా బంగారంపై ఇచ్చే రుణాలకు ఆదరణ లభిస్తున్నదన్నారు. తొమ్మిది శాతం వడ్డీకి గ్రాము బంగారంపై రూ.6,500 రుణం మంజూరుచేస్తున్నామన్నారు. బ్యాంకు బ్రాంచిలతోపాటు దాదాపు పది సొసైటీలు బంగారంపై రుణాలు మంజూరుచేస్తున్నాయన్నారు. సొసైటీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.కోటి మంజూరుచేశామని తాతారావు తెలిపారు. జిల్లాలో సొసైటీలకు సొంత భవనాలు లేని గ్రామాల్లో రైతుసేవా కేంద్రాలు కేటాయించాలని కలెక్టర్లను కోరామన్నారు. రైతు సేవా కేంద్రాలు లేనిచోట సొంత భవనాలు నిర్మించేందుకు డీసీసీబీ సాయం చేస్తుందన్నారు. ప్రస్తుత

... మిగతా 8వ పేజీలో

ప్రసూతి సేవల్లో పురోగతి

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో గణనీయంగా పెరిగిన డెలివరీలు

- ఆగస్టులో రికార్డు స్థాయిలో 319 ప్రసవాలు
- పూర్తిస్థాయిలో అందుతున్న గైనికాలజిస్టుల సేవలు
- విశాఖకు తగ్గిన రిఫరల్ కేసులు



ప్రాంతీయ ఆస్పత్రి ప్రసూతి వార్డులో బాలింతలు, నిండు గర్భిణులు

నర్సీపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): **ప్రసూతి వైద్య సేవల్లో ప్రాంతీయ ఆస్పత్రి పురోగతి సాధిస్తున్నది. గత నెలలో అత్యధికంగా 319 ప్రసవాలు జరిగి రికార్డు నెలకొల్పింది. గత రెండేళ్లలో ఇవే అత్యధికమని చెప్పకతప్పదు.**

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో కొవిడ్ తర్వాత ప్రసూతి సేవలు సన్నగిల్లాయి. రాత్రి పూట ఆస్పత్రికి వచ్చిన ప్రసూతి కేసులను ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తున్నారని ఆరోపణలు వచ్చేవి. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. ఆస్పత్రికి వచ్చిన అన్ని కేసులకు ఇక్కడే ప్రసవాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. బాగా రిస్క్ అనుకుంటే తప్ప ఇతర ఆస్పత్రులకు తరలించడం లేదు. దీంతో గత ఏడాది కంటే ఈ ఏడాది పురోగతి కనిపించింది. గత ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 1,869 డెలిరీలు జరగ్గా.. ఈ ఏడాది ఇదే కాలంలో 2,050 ప్రసవాలు చేశారు. ఈ ఏడాది జనవరిలో 264, ఫిబ్రవరిలో 271, మార్చిలో 222, ఏప్రిల్‌లో 227, మేలో 260, జూన్‌లో 231, జూలైలో 256, ఆగస్టులో 319 ప్రసవాలు చేశారు. ఆగస్టు వరకు 2,050 డెలివరీలు జరగ్గా.. వీటిలో సాధారణ ప్రసవాలు 1,135, సిజేరియన్లు 886 ఉన్నాయి. ఆస్పత్రిలో ఇద్దరు గైనికాలజిస్టులతోపాటు సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారద వైద్య సేవలు అందిస్తున్నారు. ఇద్దరు గైనిక్ పీజీ విద్యార్థులు

... మిగతా 8వ పేజీలో

ఎలమంచిలి ఎంపీపీపై అవిశ్వాసం

జనసేన నేతలు క్యాంపు రాజకీయం

- వైస్ ఎంపీపీ రాజాన శేషు ఆధ్వర్యంలో ఊటీకి..
- 24న ఆర్డీవోకు అవిశ్వాసం నోటీసు



ఇటీవల ఎమ్మెల్యే విజయకుమార్‌ను కలిసిన వైస్ ఎంపీపీ రాజాన శేషు, ఇతర ఎంపీటీసీ సభ్యులు

ఎలమంచిలి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ఎంపీపీ గోవింద్‌పై అవిశ్వాసం పెట్టేందుకు జనసేన నేతలు క్యాంపు రాజకీయానికి తెర తీశారు. మెజారిటీ ఎంపీటీసీ సభ్యులతో జనసేన పార్టీకి చెందిన వైస్ ఎంపీపీ రాజాన శేషు ఆధ్వర్యంలో ఊటీ వెళ్లారు. ఈనెల 24వ తేదీన అవిశ్వాస నోటీసును ఆర్డీఓకు అందజేయనున్నారు. మండలంలో గత

... మిగతా 8వ పేజీలో

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



మృతిచెందిన రాయి నాగేశ్వరరావు

కోటవురట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడ గ్రామ శివారులో ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.చౌడువాడ గ్రామానికి చెందిన రాయి నాగేశ్వరరావు(55) గరగ నాగేశ్వరరావు గురువారం ఉదయం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న సర్పానది ఒడ్డున వెదురుపుంతలో వెదురు నరకడానికి వెళ్లారు. కర్రలు నరుకుతుండగా ఒక కొమ్మ కోరుప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళుతున్న 220 కేవీ లైన్‌కు తగలడంతో రాయి నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన గరగ నాగేశ్వరరావు కోటవురట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్నాడు. నాగేశ్వరరావు మృతదేహం కోటవురట్ల ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎస్ఐ రమేశ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాడ్రాపల్లిలో మహిళలకు వైద్య పరీక్షలు

మునగపాక, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్. విమలగిరి తెలిపారు. వాడ్రాపల్లిలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు పలు వైద్య పరీక్షలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. నాగలక్ష్మి, కూటమి నాయకులు మళ్ల వరహానరసింగరావు, మళ్ల శేషు, కాండ్రేగుల రాము, మళ్ల మల్లయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో వైసీపీ ఆందోళన



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న వైసీపీ శ్రేణులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా గణేశ్‌ను పోలీసులు అరెస్టు చేసి అచ్యుతాపురం స్టేషన్‌కు తీసుకువస్తున్నారన్న సమాచారంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. గణేశ్‌ను నర్సీపట్నం నుంచి తాళ్లపాలెం, నరసింగబిల్లి, చూచుకొండ, ఎంజేపురం, మల్లవరం, కొండకర్ల జంక్షన్ మీదుగా వాహనంపై అచ్యుతాపురం స్టేషన్‌కు తీసుకువస్తున్నారని సమాచారం రావడంతో వైసీపీ శ్రేణులు అచ్యుతాపురం స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ విషయం తెలిసిన పోలీసులు గణేశ్‌ను ఇక్కడికి తీసుకురాకుండా వేరే ప్రాంతానికి తరలించారు.

నక్కపల్లిలో జెండర్ రిసోర్స్ సెంటర్

నక్కపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నక్కపల్లి వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన జెండర్ రిసోర్స్ సెంటర్‌ను ఎంపీడీవో సీతారామరాజు, టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వరకట్న వేధింపులు, బాల్య వివాహాలు, గృహ హింస, లైంగిక వేధింపులు తదితర విషయాలపై కౌన్సిలింగ్ ఇచ్చేందుకు ఈ కేంద్రం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి సొసైటీ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి, డీపీఎం రత్న ప్రభ, ఏపీఎం శ్రీనివాస్, లీగల్ అడ్వయిజర్ నూకరాజు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, బీజేపీ నాయకుడు కోసూరి శ్రీను పాల్గొన్నారు.

రేబాక, వేంపాడులో వైద్య శిబిరాలు

నక్కపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేబాక, వేంపాడు గ్రామాల్లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. వేంపాడులో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ కె. రఘు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద ఆస్పత్రి ఫార్మసిస్ట్ రామకృష్ణ , తదితరులు పాల్గొన్నారు. రేబాక గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వృద్ధులు, మహిళలకు గొడిచెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పరీక్షలు చేసి, మందులు అందజేశారు.

మత్స్యకారుల ఆందోళనకు అనుమతి



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న కంబాల జోగులు, వీసం రామకృష్ణ

నక్కపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేటలో మత్స్యకారులు చేస్తున్న శాంతియుత నిరసనకు పోలీస్ శాఖ అనుమతి ఇచ్చింది.గురువారం మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం నేత ఎం. అప్పలరాజు, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ నక్కపల్లిలో డీఎస్పీ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు అనుమతి ఇచ్చారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థి ప్రతిభ



దేవాన్ష్‌నాయుడిని అభినందిస్తున్న నరసింహారావు

పాయకరావుపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యా సంస్థల విద్యార్థి అద్భుత ప్రతిభ కనబర్చాడు. హరియాణా రాష్ట్రంలో ఈనెల 13 నుంచి 16 వరకు జరిగిన పోటీల్లో అండర్ -17 వ్యక్తిగత విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థి బండారు దేవాన్ష్‌నాయుడు రజిత పతకం సాధించాడు. విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం. అపర్ణ తదితరులు దేవాన్ష్‌నాయుడ్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వీధి కుక్కల స్వైరవిహారం

అచ్యుతాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల ఆవరణలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. విచ్చలవిడిగా తిరుగుతూ కనిపించిన వారిపై దాడికి పాల్పడుతున్నాయి. అచ్యుతాపురం - గాజువాక ప్రధాన రహదారిలో మోసయ్యపేట సంత వెనుక ఈ పాఠశాల ఉంది. కుక్కలు పదుల సంఖ్యలో పాఠశాల ఆవరణలోకి ప్రవేశించి హల్‌చల్ చేస్తున్నాయి. ఈ రోడ్డులో ఎక్కువగా కోడి, మేక మాంసం విక్రయ కేంద్రాలు ఉన్నాయి. మోసయ్యపేట సంతలో ప్రతిరోజూ చేపలు విక్రయిస్తారు. అక్కడ వ్యర్థాలను తిని, పాఠశాల ఆవరణలో ఉన్న చెట్ల కింద సేద తీరుతున్నాయి. దీంతో బాలికలు పాఠశాల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కుక్కలు పాఠశాల ఆవరణలోకి రాకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం ఎందుకు ?

- అధికారులపై సభ్యుల ధ్వజం
- వాడివేడిగా పాయకరావుపేట మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు కొంతం నరేశ్

పాయకరావుపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని సమస్యలను మండల సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకురావడం తప్ప ఒక్కటి కూడా పరిష్కారం కావడం లేదని, సమస్యలు పరిష్కారం కాని సమావేశాలు ఎందుకని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు అధికారులను నిలదీశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇసరపు పార్వతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల వివరాలను సభ్యులకు వివరిస్తుండగా వెంకటనగరం సర్పంచ్ వంకా వెంకటరమణ, గారా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా గెలిచిన తాము గ్రామాల్లో రెవెన్యూ, ఉపాధి, పీఆర్, విద్య, ఇరిగేషన్ , తదితర శాఖల సమస్యలను నాలుగున్నరేళ్లుగా మండల సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకువస్తున్నా.. ఏ ఒక్కటీ పరిష్కారం కావడం లేదన్నారు.అటువంటి అప్పుడు సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ఎస్ఆర్ఈజీఎస్ పథకంలో చేపట్టాల్సిన పనులను గుర్తించి పంచాయతీ తీర్మానాలు చేసినా అధికారులు పట్టించుకోకుండా వేరే పనులు ఎందుకు చేయిస్తున్నారని నిలదీశారు. పలు సచివాలయాల్లో సిబ్బంది లేక ఎటువంటి పనులు జరక్క ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై అధికారులు దృష్టిపెట్టకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఎంపీడీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యలపై త్వరలోనే అధికారులతో సమావేశం నిర్వహించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాగా సమావేశానికి 27 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా సగం మంది గైర్హాజరు కావడం పట్ల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఒక దశలో అధికారులు గైర్హాజరు కావడాన్ని నిరశిస్తూ జడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబుతో పాటు పలువురు ఎంపీటీసీ సభ్యులు సభను బాయ్‌కాట్ చేస్తున్నామని ప్రకటించి హాలు నుంచి బయటకు వెళిపోతున్న సమయంలో అధికారులు నచ్చచెప్పారు. సభ్యులు శాంతించడంతో సమావేశం కొనసాగింది. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ పల్లెల మణికంఠస్వామి, తహశీల్దారు మహేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీఓ కె. డేవిడ్, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై మంత్రి అనిత ఆగ్రహం

కోటవురట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని హోం మంత్రి అనిత అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సమావేశానికి అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై పత్రికల్లో రావడంతో మంత్రి స్పందించారు. సమావేశానికి రాని అధికారులందరికీ షోకాజు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్‌ను ఆదేశించారు.



రాంబిల్లి : అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఎలమంచిలిలో దుష్ట శక్తులు రాకుండా కర్రలతో కొట్టుకుంటూ ఊరేగింపుగా వెళుతున్న భక్తులు (ఇన్‌సెట్లో) కొత్తపాలెంలోని మరిడి మహాలక్ష్మి అమ్మవారు

పల్లెల్లో సందడే సందడి

- ఘనంగా అమ్మవార్ల పండుగలు
- తెల్లవారుజాము నుంచే భక్తులతో ఆలయాలు కిటకిట

ఎలమంచిలి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో మరిడి మహాలక్ష్మి అమ్మవారి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గ్రామస్తులంతా అమ్మవారికి ఉపారములు బండిపై తీసుకువెళ్లి సమర్పించారు. ఈక్రమంలో బండిపై దుష్టశక్తులు పడకుండా పురుషులంతా కర్రలతో కొడుతూ ఊరేగింపు చేపట్టారు. కాగా అమ్మవారిని టీడీపీ నాయకులతో పాటు మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీప పట్టణ ఉపాధ్యక్షుడు దంట్ల వెంకటస్వామి, నాయకులు దాడి రమేశ్, కొరెడ్ల మల్లికార్జునరావు, బొద్దపు అశోక్, దిగుమర్తి రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మరాజుపేటలో...

అచ్యుతాపురం : తిమ్మరాజుపేటలో మరిడిమాంబ అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులతో పాటు కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మంచినీరు, మజ్జిగ, పులిహోర ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి, శివబాపునాయుడు, రేవిడి కృష్ణ, బీశెట్టి రాము పాల్గొన్నారు.



మునగపాకలో అమ్మవారి ఉత్సవ ప్రభకు పూజలు చేస్తున్న భక్తులు

ప్రత్యేక ఆకర్షణగా ఉత్సవ ప్రభ

మునగపాక : మునగపాకతో పాటు పలు గ్రామాల్లో మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండుగ ఘనంగా జరిగింది. అమ్మవారిని తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శించుకున్నారు.గంగాదేవిపేటలో అమ్మవారిని జనసేన రాజకీయ వ్యవహారాల ప్రతినిధి సుందరపు సతీశ్‌కుమార్ దర్శించుకున్నారు. మునగపాకలో అమ్మవారికి సర్పంచ్ దిమ్మల అప్పారావు, దాడి మహేశ్ తొలిపూజ చేశారు. సాంబమూర్తి దేవస్థానం కమిటీ చైర్మన్ బూడిద శ్రీనువాసరావు ఇంటి వద్ద నుంచి మరిడి తల్లి ఉత్సవ ప్రభ ఊరేగింపు జరిగింది. ఉత్సవానికి ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సింహాద్రి అప్పన్న సేవ గరిడీలు, చిటికెల భజనలు, కోలాట ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పారావు, గ్రామ పెద్దలు దాడి మునిలినాయుడు, దాడి పోలీసు, మావూరి రాజు, అలంక ప్రకాశరావు, వేగి కృష్ణ, ఆడారి కాశి పాల్గొన్నారు.



తిమ్మరాజుపేటలో మరిడిమాంబకు పూజలు

మూలజంపలో దుర్గాంబిక జాతర

రాంబిల్లి : మండలంలోని మూలజంపలో దుర్గాంబికా అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని స్థానికులతో పాటు సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బకాయిలు చెల్లించాలని కార్మికుల ఆందోళన



గేటు ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

ఎస్. రాయవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దార్లపూడిలో ఉన్న ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ ప్రధాన గేటు ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫ్యాక్టరీ మూతబడి ఐదేళ్లు కావస్తున్నా కార్మికులకు జీత బకాయిలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర హోం మంత్రి ఉన్న నియోజకవర్గంలోనే ఇటువంటి పరిస్థితి ఉండడం దురదృష్టకరమని మండిపడ్డారు. ప్రభుత్వాల దుర్మార్గమైన విధానాల వల్లే ఫ్యాక్టరీని మూసివేయడంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడడమే కాకుండా ఈ ప్రాంతం అభివృద్ధిని నాశనం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఉన్న పరిశ్రమలను మూసివేసి కొత్తగా పరిశ్రమలను తీసుకువస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. జిల్లాలో ఉన్న నాలుగు షుగర్ ఫ్యాక్టరీల్లో ఇప్పటికే మూడింటిని మూసివేశారని, ఉన్నది కూడా మూసి వేయడానికి సిద్ధంగా ఉందన్నారు.ఇప్పటికైనా హోం మంత్రి స్పందించి అసెంబ్లీ సమావేశాల్లో షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల జీత బకాయిల గురించి చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, షుగర్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కారెడ్ల సత్యనారాయణ, రాయవరపు హనుమంతురావు, జి. గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

‘పేట’లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం



పాయకరావుపేటలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

పాయకరావుపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కొత్తగా రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని మండలంలో గురువారం నుంచి ప్రారంభించారు. తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్, కూటమి నాయకులు తోట నగేశ్, పెదిరెడ్డి చిట్టిబాబు, చించెలపు ప్రదీప్, యాళ్ళ వరహాలబాబు, పాకలపాటి రవిరాజు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు అందించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మహేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 50 రేషన్ డిపోలు ఉండగా 26,044 స్మార్ట్ కార్డులు మంజూరయ్యాయని చెప్పారు. అందరికీ రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు. కార్డుల్లో తప్పుల సవరణకు ఈనెలాఖరు వరకు సమయం ఉందని, సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ, వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు దేవవరపు రాజబాబు, చిక్కాల శ్రీనివాసరావు, కూటమి నాయకులు బొంది కాశీ విశ్వనాథం, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణ రాజు, శ్రీనివాసరావు, చింతకాయల రాంబాబు, విలియంకేరి, రమాకుమారి, పాల్గొన్నారు.

దొప్పెర్లలో...

అచ్యుతాపురం : దొప్పెర్ల పంచాయతీలో నునపర్తి ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటరావు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొండకర్ల పీఏసీఎస్ డైరెక్టర్ ఆర్. బాబూరావు, టీడీపీ మండల కోశాధికారి ముచ్చు గంగరాజు, గ్రామ అధ్యక్షుడు కొల్లి వరహాలరావు పాల్గొన్నారు. అలాగే మల్లవరం గ్రామంలో సర్పంచ్ పిన్నమరాజు వాసు, ఉప్పవరంలో చిన్ని శ్రీనివాసరావు కూడా లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.

కోటవురట్లలో..

కోటవురట్ల : మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 17853 మంది లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. తహశీల్దార్ తిరుమలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీడీ పీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు, సీనియర్ నా యకుడు జానకి శ్రీనివాసరావు, సహకార సంఘం అధ్యక్షుడు వేచలపు జనార్దన్, ఎంపీటీసీ సభ్యుడు సూర్యరావు, సర్పంచ్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్. రాయవరంలో..

ఎస్. రాయవరం : మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ జె. రమేశ్‌బాబు అధ్యక్షతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించారు. ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అబద్ధం, మాజీ అధ్యక్షుడు ఎస్. వెంకటరాజు చేతుల మీదగా లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు.



ఎస్ రాయవరంలో కార్డులు అందజేస్తున్న ఎంపీపీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ గోవిందరావు



సమావేశమైన సీపీఐ మండల సమితి కార్యవర్గ సభ్యులు

ప్రజాభిప్రాయ సేకరణకు సీపీఐ వ్యతిరేకం

పాయకరావుపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నక్కపల్లిలో ఆర్సీఎల్ఆర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం కాలుష్య నియంత్రణ మండలి ఈనెల 27న చేపట్టే ప్రజాభిప్రాయ సేకరణను సీపీఐ వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు తెలిపారు. గురువారం స్థానిక పీఆర్ గెస్టు హౌస్ ఆవరణలో సీపీఐ మండల సమితి కార్యవర్గ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు సేకరించిన భూములకు సరైన పరిహారం ఇవ్వకుండానే కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి కృషి చేయని ప్రజాప్రతినిధులు ప్రైవేటు రంగంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సహాయ సహకారాలు అందిస్తున్నారని విమర్శించారు. నక్కపల్లిలో ఇప్పటికే ఉన్న ఔషధ పరిశ్రమతో సముద్రం, భూగర్భ జలాలు, వాయు కాలుష్యంతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మత్స్యకారులు మత్స్య సంపద తగ్గి జీవనోపాధి కోల్పోయారని చెప్పారు. ఆ ప్రాంతంలో బల్క్ డ్రగ్స్ పార్కు, ప్రైవేటు స్టీల్ ప్లాంట్ ఏర్పాటు వల్ల ప్రజలు మరిన్ని ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటరమణ, మండల కార్యదర్శి అర్జునరావు, సుబ్బలక్ష్మి, రాజాబాబు, సత్యవతి, రామచంద్రరావు పాల్గొన్నారు.

పేటబయ్యవరంలో స్వచ్ఛభారత్

ఎలమంచిలి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పేట బయ్యవరం ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే కాలువను శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొడ్డేడ సత్యనారాయణ, వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్. రాయవరంలో...

ఎస్. రాయవరం : మండల కేంద్రంలో ఎంపీడీవో మీనాకుమారి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణం అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ఎలమంచిలి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రామ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త రత్నం మాట్లాడుతూ గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

పెదకవలాపల్లిలో యూరియా పంపిణీ



రైతులకు యూరియా అందిస్తున్న తహశీల్దార్ శ్రీనివాసరావు

రాంబిల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదకవలాపల్లిలో తహశీల్దార్ శ్రీనివాసరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వి. దిన్‌బాబు రైతులకు గురువారం యూరియా అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న యూరియాను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎరువుల కొరత లేదని, అన్ని రైతు సేవా కేంద్రాల్లోనూ యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి సింహగిరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

308 మందికి వైద్య పరీక్షలు

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి సంకీర్తన తెలిపారు. గురువారం పెంటకోట గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనత, అధిక రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడానికి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం 308 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు, తాతాజీ, పంచాయతీ కార్యదర్శి మురళీ, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్‌తో డబ్బు ఆదా : ఏపీఎం

మునగపాక, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంట విద్యుత్ వినియోగం అధికమైనందున సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు ద్వారా వినియోగదారులకు డబ్బు ఆదా అవుతుందని వెలుగు ఏపీఎం వై. బాలరాజు తెలిపారు. తోటాడ గ్రామంలో గురువారం సోలార్ రూఫ్ టాప్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రాజశేఖర్, కూటమి నాయకులు దొడ్డి రమేశ్, ప్రసాద్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం లీజుకు వేలం

పాయకరావుపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పాండురంగస్వామి దేవస్థానం కల్యాణ మండపం లీజుకు గురువారం వేలం పాట నిర్వహించారు. దేవస్థానం కార్యాలయంలో దేవాదాయ శాఖ ఎలమంచిలి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ డి. ఉమాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో 9 మంది పాటదారులు పాల్గొనగా రూ.13,21,00లకు వి. సోమరాజు (గాంధీ) పాట దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ కె. దివ్యతేజ మాట్లాడుతూ కల్యాణ మండపం లీజు వేలం గతంలో రూ.6,56,150లకు వెళ్లగా ఈసారి వంద శాతం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకవర్గం మాజీ అధ్య క్షుడు యాళ్ల వరహాలబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, కార్యాలయం సిబ్బంది సురేశ్, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొరుప్రోలు విద్యార్థిని

ఎస్. రాయవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న పి. వైష్ణవి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈనెల 16న అనకాపల్లి మండలం తుమ్మపాలెంలో నిర్వహించిన జూనియర్ కబడ్డీ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో వైష్ణవి ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బాలికను పాఠశాల హెచ్ఎం కప్పల ప్రసాద్, పీడీ అమ్మోరయ్య గురువారం అభినందించారు. ఈనెల 22, 23, 24 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వైష్ణవి పాల్గొనున్నట్టు వారు చెప్పారు.



లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న బుద్ధ

స్మార్ట్ కార్డులతో పారదర్శకంగా రేషన్ సరకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా రేషన్ సరకు పంపిణీ చేయడానికే లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు అందిస్తున్నట్టు మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగజగదీశ్వరరావు అన్నారు. పట్టణంలోని 81వ వార్డు పరిధిలోని పీలా వెంకటరెడ్డినాయుడు వీధిలో రేషన్ గురువారం లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రేషన్ డిపోల్లో బియ్యం కొలతల్లో కిలోన్నర తరుగు వస్తుందని లబ్ధిదారులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. గతంలో డీలర్లను జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పినప్పటికీ కొందరిలో మార్పు రాలేదన్నారు. వీరిపై జేసీ, డీఎస్‌వోలకు పార్టీ ద్వారా ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని ఆయన చెప్పారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే కఠిన చర్యలు

» జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి



మెయిన్ రోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి హెచ్చరించారు. మెయిన్ రోడ్డులోని ఫుట్‌పాత్‌ల పై ఉన్న ఆక్రమణలపై గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నెహ్రూచౌక్ నుంచి వన్ వే జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ పాదచారులు నడిచే ఫుట్‌పాత్‌లపై వర్తకులు ఆక్రమించి వ్యాపారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. దీనివల్ల ప్రయాణికులు రోడ్లపై నడవడంతో పలు సందర్భాల్లో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అంతేకాకుండా పలు దుకాణాల యజమానులు తమ దుకాణం ముందు ఫుట్‌పాత్‌ను ఇతర వ్యాపారులకు అద్దెకు ఇచ్చినట్టుఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ప్రజలు నడవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపై ఆక్రమణ చేసి వ్యాపారాలు సాగిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో టీపీవో వరప్రసాద్, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ, ఎస్ఐ అర్జున్, సచివాలయ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ అధికారులకు ఉద్యోగోన్నతులు



ఉద్యోగోన్నతి పత్రం అందుకుంటున్న నాగేశ్వరరావు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోనల్ కార్యాలయంలోని పలువురికి ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు గురువారం జీవీఎంసీ కమిషనర్ నియామకపు పత్రాలను అందజేశారు. జీవీఎంసీ పరిధిలోని జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 21 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా కమిషనర్ ఉద్యోగోన్నతి కల్పించారు. ఇందులో భాగంగా అనకాపల్లి జోన్‌కు చెందిన అందే నాగేశ్వరరావు, ఎస్‌వీ జ్యోతి, కెఆర్‌కె శర్మలకు ఉద్యోగోన్నతి లభించింది.

పారిశుధ్య కార్మికులకు సత్కారం



గాంధీనగరంలో పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తుమ్మపాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజరు పంచాయతీ తుమ్మపాలలో గురువారం బీజేపీ జిల్లా కార్యదర్శి భానుమతి పారిశుధ్య కార్మికులను సత్కరించి వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సమాజంలో అసమానతలను రూపుమాపేలా ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికులను ప్రత్యేక దృష్టితో చూస్తున్నదన్నారు. పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ఎనలేనివన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో కలిసి వీధుల్లో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ ఉద్యోగుల నిరసన



ఈఈ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈపీడీసీఎల్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈపీడీసీఎల్ ఈఈ కార్యాలయం ఎదుట గురువారం భోజన విరామ సమయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఆగస్టు 2023లో విద్యుత్ సంఘాలతో రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమక్షంలో కుదిరిన ఒప్పందం ప్రకారం యాజమాన్యమే నేరుగా వేతనాలు ఇవ్వాలని డిమాడ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ (1104), డిప్లొమా ఇంజినీర్లు, కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన ఉద్యోగులు, జేఏసీ నాయకులు అనకాపల్లి నూకరాజు, పడాల సోమన్నదొర, కుంచుబాబు, పేరపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీ కోసం ఆధార్ లింక్ చేసుకోండి

» జాయింట్ కలెక్టర్ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సబ్సిడీ నగదు బ్యాంకు ఖాతాలో జమకాని లబ్ధిదారులు ఆధార్ లింక్ చేసుకోవాలని జేసీ ఎం.జాహ్నవి సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో దీపం-2 పథకంలో భాగంగా రెండో విడత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, బ్యాంకు ఖాతాకు సబ్సిడీ నగదు జమపై సంబంధిత అధికారులు, గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలోని 24 ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీ డీలర్లకు దీపం-2 పథకంలో భాగంగా రెండో విడత గ్యాస్ సిలిండర్ల పంపిణీలో 805 మందికి సబ్సిడీ నగదు బ్యాంకు ఖాతాలో జమ కాలేదన్నారు. అందుకు గల కారణాలు లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. ఆధార్ లింక్ కానందున గ్యాస్ సబ్సిడీ నగదు జమకాని లబ్ధిదారులు నేరుగా బ్యాంకుకు వెళ్లి ఆధార్ లింక్ చేసుకోవాలని సూచించారు. ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీ డీలర్లు, అధికారులు ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. అలాగే బ్యాంకు ఖాతాకు ఆధార్ ఎన్‌పీసీఐ లింక్ అయిన తర్వాత మాత్రమే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు గ్యాస్ సబ్సిడీ నగదు జమ చేయడం జరుగుతుందని జేసీ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి కేవీఎల్ఎన్ మూర్తి, పౌర సరఫరాల ఉప తహసీల్దార్లు, ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీ డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వాల తోడ్పాటు

» రూ.3 లక్షల రుణ సదుపాయం, రాయితీ

» జిల్లా పరిశ్రమల శాఖ ఐపీవో త్రివేణి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐపీవో త్రివేణి

సబ్బవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు చదువుకుని, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటునందిస్తాయని జిల్లా పరిశ్రమల ఐపీవో త్రివేణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో పి.పద్మజ అధ్యక్షతన ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి త్రివేణి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగింగారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే యువ పారిశ్రామికవేత్తలకు కేంద్ర ప్రభుత్వం జెడ్ (జీరో ఎఫెక్ట్, జీరో డిఫెక్ట్) సర్టిఫికెట్ ఉచితంగా జారీ చేస్తున్నదని చెప్పారు. అలాగే పారిశ్రామికవేత్తలుగా ముందుకు వచ్చే యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.3 లక్షల వరకూ రుణ సదుపాయంతో పాటు రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెడ్ క్వాలిటీ డెవపల్‌మెంట్ కంపెనీ సీఈవో కాళ్ల జగపతి, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎస్.సాగర్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎం.బంగార్రాజు, కార్యదర్శి సిహెచ్.సూరిబాబు, రామకృష్ణ, ఎంఎస్ఎంఈ సిబ్బంది, చిన్నతరహా పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి వేడుకలకు ఏర్పాట్లు

» ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గవరపాలెంలోని సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ తెలిపారు. గురువారం సతకంపట్టు వద్ద కల్యాణ మండపంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను నిర్వాహకులు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 22న భవానీ మాలధారణ చేసిన వారికి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సహకారంతో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అదే రోజున అమ్మవారికి కుంకుమ పూజలు, హోమాలు జరుగుతాయని చెప్పారు. సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో రథంపై ఊరేగిస్తామన్నారు. 29న విద్యార్థులకు పుస్తకాలు, బట్టలు, పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, తువ్వాళ్లు పంపిణీ చేస్తామన్నారు. 30న కాండ్రేగుల నాయుడు, మళ్ల జగ్గఅప్పారావు దంపతులచే ముత్తాయిదువులకు భారీ ఎత్తున వాయినం కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఎల 2న అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, గౌరీ పరమేశ్వరి, మరిడిమాంబ ఆలయ కమిటీల ప్రతినిధులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ బీవీ నూకరాజు, కొణతాల మురళీకృష్ణ, కేఎం నాయుడు, కొణతాల ప్రసాద్, కాండ్రేగుల శ్రీరామ్, దాడి కృష్ణ, కాండ్రేగుల వెంకట సాంబశివరావు, పొలమరశెట్టి యుగంధర్, పిళ్లా తారకేశు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నేస్తాలమ్మ జాతర

పరవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాడచీపురుపల్లి, నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో ప్రజల ఆరాధ్య దైవం నేస్తాలమ్మ జాతర గురువారం వైభవంగా జరిగింది. ఉదయం ఆరు గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు దంపతులతో పాటు సర్పంచ్‌లు కూండ్రపు వరలక్ష్మి, శివలంక లక్ష్మి, ఎంపీటీసీ మాజీ సభ్యులు సీతారామయ్య, శ్రీరామమూర్తి, జనసేన నాయకులు వెలుగుల అనిల్‌కుమార్, పంది రాజు, పోలవరపు రవి, సరిపల్లి సతీశ్ అమ్మవారిని దర్శించుకున్నారు. పురవీధుల్లో అమ్మవారి ఘటాలు ఊరేగించి, ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు.

ఘనంగా దుర్గమాంబ పండుగ

కశింకోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవరపేట పెద్దగుమ్మంలో ఉన్న దుర్గమాంబ అమ్మవారి పండుగ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని అన్ని రకాల పుష్పాలతో అలంకరించి భక్తులను దర్శన సౌకర్యం కల్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం ఆలయం వద్ద పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

దస్తావేజు లేఖరుల కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం

సబ్బవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దస్తావేజు లేఖరుల మండల కార్యవర్గ ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా బిక్కవల్లి శ్రీరామమూర్తి, అధ్యక్షుడిగా వల్లభజోస్యుల సీతారామమూర్తి, ఉపాధ్యక్షుడిగా జూరెడ్డి శ్రీరామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు పట్నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దంతులూరి సురేష్‌వర్మ, జాయంట్ సెక్రటరీగా గొంప శేఖర్, లీగల్ అడ్వైజర్‌గా బి.సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని సబ్ రిజిస్ట్రార్ జిలానీబేగంకు కార్యవర్గం ప్రతినిధులు వినతిపత్రం అందించారు.

ఆయుర్వేద మందుల పంపిణీ

కొత్తూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని గొల్లవీధి అర్బన్ పీహెచ్‌సీలో గురువారం ఆయుర్వేద వైద్య శిబిరం జరిగింది. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సుమారు 75 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి లావణ్య, ఆయుష్ సిబ్బంది సి.గణేశ్, యోగా శిక్షకులు, బి.అప్పారావు, ఎం.చంద్రిక పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

సబ్బవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు సూచించారు. పీహెచ్‌సీలో గురువారం స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. డీఐవో చంద్రశేఖర్‌దేవ్ మాట్లాడుతూ 13 ఏళ్లు దాటిన మహిళలకు క్యాన్సర్ పరీక్షలను చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఎస్ఎన్ఆర్.చక్రవర్తి, ఆశ, విద్యాధరి, కుసుమకుమారి, సీహెచ్‌వో స్వర్ణలత, ఎంపీహెచ్‌వో జేసుదాసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాడచీపురుపల్లి అభివృద్ధికి నిధులు కేటాయించాలి

పరవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాడచీపురుపల్లి పంచాయతీ శివారు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని సర్పంచ్ శివలంక లక్ష్మి కోరారు. ఈ మేరకు గురువారం సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సమీర్ శర్మను కలిసి వినతిపత్రం అందించారు. పంచాయతీలో సోలార్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కూండ్రపు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి స్థల పరిశీలన



కశింకోట రైల్వే స్టేషన్ గేటు వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

కశింకోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కావాల్సిన స్థలాలను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, రైల్వే ఏజెన్సీ ప్రతినిధులు కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కశింకోట, గొబ్బూరుపాలెం, జెడ్.తుని గ్రామాల్లో ఉన్న రైల్వే స్టేషన్ గేట్లను సందర్శించి నిర్మాణానికి కావాల్సిన స్థలాలను పరిశీలన చేశారు. ఆమె వెంట ఆర్డీవో ఆయిషా, తహశీల్దార్ సిహెచ్.తిరుమలరావు, మండల సర్వేయర్ రామారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తదితరులు ఉన్నారు.

డైట్‌తో రోబో కప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం



ఒప్పంద పత్రాలతో సీఈవో ప్రవీణ్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలతో రోబో కప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ప్రవీణ్ మళ్ల గురువారం కీలక అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా మళ్ల ప్రవీణ్, హర్ష ముఖ్య అతిథులుగా హాజరై రాబోయే తరాలకు ఆవిష్కారాత్మక విద్యనందించేందుకు పరిశ్రమ-విద్యా సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే దిశగా ముందడుగు వేశారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు రోబోటిక్స్, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ రంగాల్లో ప్రాక్టికల్ శిక్షణ, పరిశ్రమ ప్రాజెక్టు, ఇంటర్న్‌షిప్ సంయుక్త పరిశోధనా అవకాశాలు కలుగుతాయని వారు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ ఈ ఒప్పందం విద్యార్థులందరికీ నూతన అవకాశాలు తెరవడమే కాకుండా రోబో కప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ దూరదృష్టిని, ప్రగతిశీల దృక్పథాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జీవీ శ్రీధర్, డాక్టర్ పణిబాబు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

చెట్టినాడు సిమెంట్స్‌కు ఇంధన సామర్థ్య అవార్డు



జాతీయ ఇంధన సామర్థ్య అవార్డు అందుకుంటున్న విశాఖ యూనిట్ ప్రతినిధులు

కశింకోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం గ్రామ సమీపంలో ఉన్న చెట్టినాడు సిమెంట్స్‌కు జాతీయ శక్తి సామర్థ్య యూనిట్ అవార్డు-2025 లభించింది. హైదరాబాద్‌లో ఈ నెల 17న నిర్వహించిన నేషనల్ అవార్డు ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ న్యాయ నిర్ణేతల ప్యానల్ మూల్యాంకనాల ఆధారంగా ఈ అవార్డు అందించారని ఏజీఎం నరసింహరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవార్డును విశాఖ యూనిట్ హెడ్ పి.ప్రసాద్‌బాబు తదితరులు అందుకున్నారని తెలిపారు. సంస్థకు ఈ అవార్డు రావడం పట్ల ఉద్యోగులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు దిశగా సంస్థ పయనించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

» జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేరగాళ్లు నూతన పద్ధతులు అవలంబిస్తూ ప్రజలను మోసం చేస్తున్నందున, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ మోసాలకు ఎవరైనా గురైతే 1930 నంబరుకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించడం ద్వారా ఇలాంటి నేరాలను అరికట్టవచ్చునన్నారు.

22 నుంచి ఆహ్వాన నాటకోత్సవాలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22 నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు జరగనున్నాయి. గౌరీ సంఘం ఆవరణలోని కర్రి రమేశ్ కళావేదికపై ఈ నెల 26వ తేదీ వరకు నాటకోత్సవాలు జరుగుతాయి. ఇందులో భాగంగా 22న ఖమ్మం జిల్లా మధిర సుమిత్ర యూత్ అసోసియేషన్ వారి శ్రీరామ పాదుకా పట్టాభిషేకం పద్యనాటకం నిర్వహించనున్నారు. 23న సాయంత్రం ఆరున్నర గంటలకు విజయవాడ యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ వారి 27వ 'మైలురాయి', ఎనిమిది గంటలకు గుంటూరు సాయి ఆర్ట్స్ వారి 'జనరల్ బోగీలు', 24న సాయంత్రం హైదరాబాద్ మల్లాది క్రియేషన్స్ వారి 'ఆవేశంలో ఆనందం', రాత్రికి గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి 'ఇది అతని సంతకం' నాటికలు నిర్వహించనున్నారు. అలాగే 25న సాయంత్రం హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ వారి 'అమ్మ చెక్కిన బొమ్మ', రాత్రికి గుంటూరు సద్గురు కళా నిలయం వారి 'నాన్న', 26న సాయంత్రం గుంటూరు తాడేపల్లి అరవింద ఆర్ట్స్ వారి 'విడాకులు కావాలి', రాత్రికి విజయవాడ హర్ష క్రియేషన్స్ వారి 'భువి కోరని భ్రమణం' నాటిక ప్రదర్శనలకు ఏర్పాటు చేశామని కనకదుర్గ ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కశింకోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ పరిధిలో ఉన్న 33/11కేవీ, కన్నూరుపాలెం సబ్ స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనులు కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్నూరుపాలెం, పాత కన్నూరుపాలెం, తీడ, చెరకాం, జి.భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్తఅచ్చెర్ల, మోసయ్యపేట, గోకువానిపాలెం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో వ్యవసాయ కనెక్షన్ల వినియోగదారులకు విద్యుత్ ఉదయం 4 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి 5 గంటల వరకు మార్పులు చేయడం జరిగిందన్నారు. ఈ అంతరాయాన్ని గమనించి తమ సిబ్బందికి ఆయా ప్రాంతాల వినియోదారులు సహకరించాలని కోరారు.

నేడు సబ్బవరంలో...

సబ్బవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సబ్బవరం-01 సెక్షన్ పరిధిలోని 33/11కేవీ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం, ఇరువాడ, పైడివాడ, గొల్లలపాలెం, అమృతపురం, తవ్వవానిపాలెం, బాటజంగాలపాలెం, నారపాడు, నల్లరేగులపాలెం పంచాయతీల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని స్పష్టం చేశారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఈఈ కోరారు.

క్రెబ్స్ కార్మికులకు న్యాయం చేయాలి

కశింకోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డున పడిన క్రెబ్స్ బయోకెమికల్ కంపెనీ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ విజయవాడ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్ పంచకర్ల నాగ సందీప్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక యూనియన్ ప్రతినిధులు మాట్లాడారు. కశింకోట మండలం కొత్తపల్లి గ్రామంలో ఉన్న క్రెబ్స్ కంపెనీకి ఫిబ్రవరి 2న పవర్ నిలిపివేశారని, దీన్ని కారణంగా చూపించి కార్మికులకు ఏప్రిల్ 1న లేఆఫ్ విధించి రోడ్డు పడేసిందన్నారు. దీంతో కార్మికులంతా దిక్కుతోచని స్థితిలో జీతభత్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్ సందీప్ యాజమాన్యంతో చర్చించి న్యాయం జరిగేలా చేయాలని కోరారు. కంపెనీపై పరోక్షంగా ఆధారపడే కార్మికులు ఉపాధి కోల్పోయారని గంటవానిపాలెం సర్పంచ్ అప్పలరాజు తెలిపారు. తక్షణమే కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు.

'అనుమతులు లేకుండా ఎగ్జిబిషన్ ఏర్పాటు తగదు'

తుమ్మపాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పక్కన సర్వే నంబరు 813 పోలీస్ ఠాణా స్థలంలో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం తగదని సీపీఐ నాయకులు గురువారం అభ్యంతరాన్ని తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా నాయకుడు వైఎన్ భద్రం మాట్లాడుతూ గతంలో ఇదే స్థలం కబ్జాకు గురవుతున్న తరుణంలో అప్పటి జీవీఎంసీ కమిషనర్ కనక మహాలక్ష్మి దృష్టికి తీసుకురాగా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అంతేకాకుండా ఈ స్థలం తాలూకా వివాదం కోర్టులో ఉండగా, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం కోర్టు ధిక్కారం నేరం కింద వస్తుందన్నారు. 20 రోజులుగా ఎగ్జిబిషన్ ఏర్పాటు పనులు జరుగుతున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే ఎగ్జిబిషన్‌ను నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు

కొత్తూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాన నరేంద్రమోదీ జన్మదినోత్సవాల్లో భాగంగా పారిశుధ్య కార్మికులను భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు గురువారం సత్కరించారు. గాంధీనగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్మికులకు మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. అ లాగే నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొడ్డేడ నాగేశ్వరరావు, పట్టాభి ప్రసాద్, పలకా రవి, కనక మహాలక్ష్మి, రాజు, అప్పారావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోను కలిసిన ఏపీ టీడబ్ల్యూటీ సంఘ నాయకులు



పీవోను కలిసిన ఉపాధ్యాయ సంఘ నాయకులు

పాడేరురూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ నూతన పీవో తిరుమణి శ్రీపూజను ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర, జిల్లా నాయకులతోపాటు ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు వేర్వేరుగా గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రేగం సూర్యనారాయణ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తు న్న బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు జీవీవీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి టి.నాగేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు కుర్తాడి రామారావు, సీహెచ్.చిట్టిపడాల్, జాయింట్ సెక్రటరీ జి.రవికుమార్, ఏపీ టీడబ్ల్యూటీయూ విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కంబిడి నీలకంఠం, ప్రధాన కార్యదర్శి ఎం.శోభన్‌బాబు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాలు



జిల్లా కేంద్రంలో రక్తదానం చేస్తున్న బీజేపీ నేతలు

కొయ్యూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలో సేవా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం తాటిమానుపాలెంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. అలాగే, మండల పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో పలువురు నేతలు జిల్లా కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. బీజేవైఎం కార్యదర్శి కొండబాబు, మండల పదాధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



మర్రిగుడలోని శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్‌లు, తదితరులు

అనంతగిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువశోభ పంచాయతీ మర్రిగుడలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు గురువారం స్థానిక సర్పంచ్ కొర్రా సింహాద్రి ఆధ్వర్యంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ.. జడ్పీ నిధులు రూ. 7 లక్షలతో డ్రైనేజీ, సీసీరోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. అలాగే మండలంలో జడ్పీ నిధులు రూ.1.5 కోట్లను అభివృద్ధి వెచ్చించమని వివరించారు. కార్యక్రమంలో అనంతగిరి, టోకూరు సర్పంచ్‌లు రూతు, మోస్య, జనసేన మండల అధ్యక్షుడు సిహెచ్.మురళీ, నాయకులు గుండు, నాగులు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రమణబాబు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గా బీహెచ్‌వీ రమణబాబు నియమితులయ్యారు. నెల రోజుల క్రితం ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు పదవీ విరమణ పొందడంతో ఏవో ఇమ్మానుయేలు ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహించారు. తాజా బదిలీలో రమణబాబు ఇక్కడికి వచ్చారు. ఈమేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను కూటమి, వైసీపీ నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పోతురాజు కొండలరావు, జనసేన మండలాధ్యక్షుడు కొయం బాలరాజు, జేబీపీ మండలాధ్యక్షుడు కాకూరి శేఖర్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ నూకరాజు, నాయకులు ముక్కలి కల్యాణి, జుర్ర వెంకట లక్ష్మి, వైసీపీ నాయకులు అంజి, సర్పంచ్ కుందరి రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు ఉద్యోగుల సమస్యలపై గ్రీవెన్స్

పాడేరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ కార్యాలయంలో ప్రజలకు నిర్వహించే మీ కోసం అనంతరం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఉద్యోగుల కోసం గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డోలీ రహిత గ్రామాలే లక్ష్యంగా రోడ్ల నిర్మాణం

» విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర



గుంటసీమ నుంచి తడ్డా గ్రామ రహదారి శంకుస్థాపన చేస్తున్న దొన్నుదొర

డుంబ్రిగుడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): డోలీ మోత రహిత గ్రామాలే లక్ష్యంగా రహదారులను ప్రభుత్వం నిర్మిస్తోందని విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర అన్నారు. మండలంలోని గుంటసీమ రోడ్డు నుంచి తడ్డా గ్రామం వరకు మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణానికి కూటమి శ్రేణులతో కలిసి ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 2.90 కోట్లతో ఈ బీటీ రోడ్డు నిర్మించనున్నట్టు చెప్పారు. నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గిరిజన ప్రాంతంలో శాశ్వత రహదారుల కల్పనకు రూ. 100 కోట్లు కేటాయించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత ప్ర భుత్వం గిరిజన ప్రాంత అభివృద్ధిని విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తు న్న పథకాలతో ప్రజలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి దన్నుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అరకు లోయ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరావు, మాజీ అధ్యక్షుడు సుబ్బారావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ సుబ్బారావు, నేత చినగెన్ను, టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, భాస్కరరావు, జక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

కోరాపల్లికి తాగునీటి పథకం ప్రారంభం

జి.మాడుగుల: మండలంలోని కోరాపల్లి పంచాయతీ కేంద్రం ఎగువ వీధికి తాగునీటి సరఫరాను గురువారం సర్పంచ్ మసాడ పెద బాలన్న ప్రారంభించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా స్థానికంగా తాగునీటి పథకం నిర్మించినట్టు చెప్పారు. దీంతో కాలనీవాసులకు తాగునీటి సమస్య పరిష్కారమైందన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు కె.శ్రీనివాస్, దేవి నాయుడు, చిట్టిబాబు, సూర్యనారాయణ, గంగన్నపడాల్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో జాప్యం

» యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు



పాడేరులో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

పాడేరురూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయులు, విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు వి.మహేశ్వరరావు ఆధ్వర్యంలో అరకులోయలో గురువారం ప్రారంభమైన రాష్ట్ర రణభేరి బైక్ జాత డుంబ్రిగూడ, హుకుంపేట మీదగా గురువారం సాయంత్రానికి పాడేరుకు చేరుకుంది. ఈసందర్భంగా మోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల రద్దు, మెరుగైన పీఆర్సీ, ఐఆర్ ప్రకటిస్తామని, సకాలంలో డీఏలను చెల్లిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తర్వాత నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఉ ద్యోగ, ఉపాధ్యాయులకు గత పీఆర్సీ బకాయిలు రూ. 30 వేల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. అనంతరం పాడేరులో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు ఎస్.కిశోర్‌కుమార్, శ్రీలక్ష్మి, జిల్లా సహాధ్యక్షుడు టి.చిట్టిబాబు, నాయకులు మొశ్యా ధర్మారావు, పి.దేముడు, రఘునాథ్, నారాయణ, పలుమండలాల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 15న శ్రీకాకుళం జిల్లా నుంచి యూటీఎఫ్ చేపట్టిన రణభేరీ జాత గురువారం స్థానిక మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కార్యదర్శి కిశోర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులకు వినియోగించరాదని ప్రభుత్వాన్ని కోరారు. సంఘ జిల్లా అధ్యక్షుడు మహేశ్వరరావు, నాయకులు కన్నయ్య, బాలకృష్ణ, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్‌లు ప్రారంభం

పాడేరురూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రథమ సంవత్సర బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపులలో అడ్మిషన్‌లు ప్రారంభమయ్యాయని స్థానిక ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు గురువారం సీట్ అలాట్‌మెంట్ చేస్తామన్నారు. వీరంతా 19వ తేదీ శుక్రవారం కళాశాలకు వచ్చి రిపోర్టు చేయాలన్నారు. లేకుంటే సీటు కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

మత్స్యకారులకు లైసెన్స్‌లు అందించాలి



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

పాడేరురూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నదీ పరీవాహక ప్రాం తాల్లోని గిరిజన మత్స్యకారులకు లైసెన్స్‌లు అందించేలా కృషి చేయాలని కోరుతూ టీడీపీ డివిజన్ నాయకుడు, దారెల పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి గురువారం ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంచంగిపుట్టు మండలం దారెల, పెదగూడ, సుజనకోట, పనపుట్టు, జోలాపు ట్టు, రంగబయలు పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు మత్స్యగెడ్డ నదీ పరీవాహక ప్రాంతంలో చేపల వేట ప్రధాన జీవనాధారంగా బతుకుతున్నారన్నారు. లైసెన్స్‌లు లేక ప్రమాద వశాత్తు గెడ్డలో వారు పడి మరణించినా ప్రభుత్వం నుంచి ఎటువంటి బీమా వర్తించడంలేదన్నారు. ఈస్థితిలో లైసెన్స్‌లతో పాటు బోట్లు, వలలు అం దించాలని పీవోను కోరామన్నారు. మురళి, తిరుపతి, త్రినాథ్, రామలింగం, దేవరాజు పాల్గొన్నారు.

పశుసంవర్థక శాఖ ఏడీగా కిశోర్



పెదబయలు, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులుగా (అసిస్టెంట్ డైరెక్టర్)గా డాక్టర్ నాతి కిశోర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడికి ఏడీగా వచ్చారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు. పశుసంపద వృద్ధికి కృషి చేస్తానన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి, జీకే వీధి మండలాల్లో శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పాడేరు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. వేణుగోపాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలన్నారు.

ఒడిశా మద్యం పట్టివేత

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న ఒడిశా మద్యంను స్థానిక పోలీసులు గురువారం పట్టుకున్నట్టు తెలిసింది. ఓ వ్యాన్‌లో కిరాణా సామగ్రి మధ్యలో మద్యం బాక్సులను ఉంచి మారుమూల గ్రామాలకు తరలిస్తున్నట్టు తెలిసింది. ఇదే సమయంలో బుంగాపుట్టు పంచాయతీ గర్రం ఘాట్ మార్గంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారు. అటుగా వచ్చిన ఈ బొలెరో వాహనాన్ని ఆపి పోలీసులు తనిఖీ చేయగా ఒడిశాకు చెందిన భారీగా మద్యం బాక్స్‌లు ఉన్నట్లు గుర్తించినట్టు సమాచారం. సుమారు 90 బాక్సులను పోలీసులు స్వాధీనం చేసుకొని స్థానిక స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వాహనం, మద్యం జోలాపుట్టుకు చెందిన ఓ వ్యాపారివని సమాచారం. ఈ విషయాన్ని స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లగా ఒడిశాకు చెందిన మద్యంను పట్టుకున్న మాట వాస్తవమేనని, విచారణ సాగుతుందని, శుక్రవారం పూర్తి సమాచామందిస్తామన్నారు.



నిత్యవసర సరుకులు మధ్యలో మద్యం బాక్సులు ఉంచిన దృశ్యం

పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా 22న జీపుజాత

పంప్డ్ స్టోరేజీ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు ప్రభాస్

సీలేరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో పంప్డ్ స్టోరేజీ, హైడ్రో ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 22న జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ బూసుకొండనుంచి జీపు జాత చేపట్టనున్నట్టు పంప్డ్ స్టోరేజీ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు ప్రభాస్ తెలిపారు. గురువారం బూసుకొండ గ్రామంలో వివిధ గ్రామాల నిర్వాసితులతో ప్రభాస్ ఆధ్వర్యంలో జీపుజాత కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ అధ్యక్షుడు మార్క్ రాజు, మనోజ్‌కుమార్, శ్రీను, పెసా కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

27న మజ్జివలసలో బహిరంగ సభ

పాడేరురూరల్: హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దు చేయాలని హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరిట ఆదివాసీ హక్కులను ప్రభుత్వాలు ఉల్లంఘిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో 22న సీలేరులో జీపు యాత్రను ప్రారంభిస్తారన్నారు. 27వ తేదీన జీపు యాత్రను హుకుంపేట మండలం మజ్జివలస గ్రామంలో ముగింపు సభ ఉంటుందన్నారు.

జెన్‌కో ఉద్యోగులు ఆందోళన

సీలేరు, సెప్టెంబరు 18 , (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం భోజన విరామ సమయంలో సీలేరు జలవిద్యుత్ కేంద్రం గేటు వద్ద జెన్‌కో ఉద్యోగులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ జేఏసీ ప్రాంతీయ చైర్మన్ వై. సత్తిబాబు, కన్వీనర్ వై దారాజు మాట్లాడుతూ, కేంద్ర విద్యుత్ జేఏసీ పిలుపు మేరకు దశల వారీగా నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు. విద్యుత్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే అందించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేసారు. ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చి , రిటైర్డు ఉద్యోగులకు పెంక్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అన్‌లిమిటెడ్ మెడికల్ పాలసీని వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ జెన్‌కో యాజమాన్యం మెండి వైఖరి వీడి తమ సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు.

మహిళా సంఘాల ఆర్థిక పురోభివృద్ధికి కృషి: పీవో



హుకుంపేట వెలుగు అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో శ్రీపూజ

హుకుంపేట సెప్టెంబరు 18 ఆంధ్రజ్యోతి: స్వయం సహాయ సంఘాల మహిళ సభ్యులకు ఆర్థిక పురోగతికి కృషి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో జి. శ్రీపూజ తెలిపారు. గురువారం ఆమె పీవోగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా మండలంలోని తిగలవలస నూకురు పంచాయతీ పరిధిలోని వందన్ వికాస కేంద్రాల నిర్మాణాలు పరిశీలించారు. సిబ్బంది పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం స్వయం సహాయ సంఘాల సభ్యుల భరోసాకు వందన్ వికాస భవనాలు పూర్తి చేస్తోందన్నారు. పొదుపు గ్రూపుల వ్యాపార అభివృద్ధికి ఆర్థిక సాయం అందించాలని వెలుగు సిబ్బందికి సూచించారు. పసుపు, కాఫీ, చింతపండును కొనుగోలు చేసి వాటితో నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేసి అధిక ధరలకు విక్రయించవచ్చునని సూచించారు. మండలంలో 7 వికాస భవనాలు పూర్తి చేసి వెలుగు సిబ్బందికు అప్పగించాలని ఇంజనీరింగ్ ఆధికారులకు తెలిపారు. ఈ భవన నిర్మాణాలపు పరిశీలించి ఆమె సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ ధృవ, మండల పరిషత్ ఏవో సన్యాసిరావు, ఏపీఎం లక్ష్మి సర్పంచ్ బేసు తదితరులు పాల్గొన్నారు.

కాఫీ రైతులకు పెట్టుబడి రుణాలు: జీసీసీ బ్రాంచి మేనేజర్



మాట్లాడుతున్న జీసీసీ మేనేజర్ సుగునాథం

చింతపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీసీసీ ద్వారా కాఫీ రైతులకు పెట్టుబడి రుణాలు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్టు బ్రాంచి మేనేజర్ చల్లంగి సుగునాథం అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీ రైతులు పండించిన కాఫీ గింజలకు జీసీసీ మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తోందన్నారు. గత ఏడాది కాఫీ రైతులకు అంతర్జాతీయ మార్కెట్ ఆధారంగా జీసీసీ గరిష్ఠంగా పార్చిమెంట్‌కి రూ.400, చెర్రీ రూ.250, ఆర్గానిక్ చెర్రీ రూ.330 ధరలను అందించామన్నారు. ఈ ఏడాది మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. ఆదివాసీ రైతులు దళారుల వద్ద రుణాలు తీసుకుని వారికి పంట తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారన్నారు. ఈ స్థితిలో ఒక్కొక్క రైతుకి ఎకరానికి రూ.ఐదు వేల నుంచి గరిష్ఠంగా రూ.20వేలు అందజేస్తామన్నారు. గతంలో రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని వ్యక్తులకు కొత్త రుణాలు మంజూరు చేసేదిలేదన్నారు. మండలంలోనున్న 56 డీఆర్ డిపోల్లో శిథిలావస్థకు చేరుకున్న 30 డిపోలు, కాఫీ, ఎంఎల్ఎస్ గోదాములు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ ఏడాది రాజ్‌మా, పసుపు కొనుగోలు చేయనున్నట్టు వివరించారు.

ఆదివాసీ వనమూలికా వైద్యులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆదివాసీ వనమూలికా వైద్యులు

పాడేరురూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ వనమూలికా వైద్యులకు శిక్షణ కార్యక్రమాన్ని సీపీఎఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో లయ సంస్థ కార్యాలయంలో గురువారం అందించినట్టు సీపీఎఫ్ సంస్థ ప్రోగ్రాం అధికారి ఆచార్య నాగమణి తెలిపారు. ఈ సందర్భంగా మూ లికా వైద్యులు వారికి వైద్యంలో ఉన్న అనుభవాలను తోటి వైద్యులతో పంచుకున్నారన్నారు. అనంతరం వనమూలికా వైద్యులు గెమ్మెలి చిట్టిబాబు మూలికా వైద్యులకు పలు అంశాలను వివరించారు. సీపీఎఫ్ సంస్థ ప్రోగ్రాం అధికారి ఆచార్య నాగమణి మాట్లాడుతూ ఈ ఏడాది పాడేరు, డుంబ్రిగూడ మండలాలకు చెందిన 8 మంది మూలికా వైద్యులను ఔషధ మొక్కల పెంపకానికి ఎంపిక చేశామన్నారు. ఒక్కొక్కరికి అడ్డతీగల నుంచి తీసుకువచ్చిన 20 రకాల మొక్కలను అందజేశారు. వాటి రక్షణ సంస్థ నుంచి ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు, డుంబ్రిగూడ మండలాలకు చెందిన 48 మంది మూలికా వైద్యులు, సీపీఎఫ్ సి బ్బంది సీదరి కమల, వంతాల మాలతి, బురిడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



గిరిజనులకు మందులను పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి సౌజన్యదేవి

చింతపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో గాలికుంటు వ్యాధి నియంత్రణకు గిరిజనులు విధిగా టీకాలు వేయించాలని లోతుగెడ్డ పశువైద్యాధికారి మత్స్యరాస సౌజన్యదేవి అన్నారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గురువారం మేడూరులో ప్రత్యేక పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. 296పశువులకు టీకాలు వేశారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకితే తీవ్రమైన జ్వరం, నీరసం వస్తుందన్నారు.ఈవ్యాధిని సకాలంలో నివారణ చర్యలు చేపట్టకపోతే పశువులు మరణించే ప్రమాదం ఉందన్నారు. పశుసంవర్థకశాఖ సిబ్బంది సంధ్య, మనోజ్, శివ, శివాజీ, మహేశ్, చిన్నారావు, అరుణ, వాసుదేవ్ పాల్గొన్నారు.

500 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

అనంతగిరి: మండలంలోని పాతకోట, టోకూరు, కొండిబ, సింగర్భ, సాడ, తేకవలస, నడిమివలసల్లో పశువులకు గాలికుంటు, డెక్కజడుపు వ్యాధి నిరోధక టీకాలను గురువారం సిబ్బంది వేశారు. పశువైద్యాధికారులు సాగిరి గణేశ్వరరావు, అనిల్ ఆదేశాల మేరకు.. వైద్య సిబ్బంది గ్రామాలకువెళ్లి సుమారు 500పశువులకు ఈ టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఏ శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది మోహన్‌రావు, సోమ, అప్పారావు, శేఖర్, అరుణ్, ఉదయ్ పాల్గొన్నారు.

విపత్తుల నివారణపై నేడు మాక్‌డ్రిల్

పాడేరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విపత్తుల నియంత్రణపై ప్రజల్లో అవగాహన కు శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు కలెక్టరేట్ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం తొమ్మిది గంటల నుంచి మాక్‌డ్రిల్ నిర్వహిస్తారన్నారు. వరదలు, అగ్నిప్రమాదాలు, కొండచరియలు విరిగిపడడం, తదితర విపత్తుల సంభవించే క్రమంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారన్నారు. మాక్‌డ్రిల్ నేపథ్యంలో ప్రజలు అపోహలతో భయాందోళనకు గురికావద్దని కోరారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్

కొయ్యూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్ కోరారు. గురువారం రావణాపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం నునిర్వహించారు. పలువురికి బీపీ షుగర్, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ తో పాటు రక్త హీనత పరీక్షలు చేసి తగిన మందులు అందచేశారు. కిషోర బాలికలకు పోషకాహారం ఆవశ్యకతను వివరించారు. పిల్లలు, గర్భిణులకు వ్యాధి నిరోదక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్, పీహెచ్ఎన్ భాగ్యవతి, పాఠశాల హెచ్ఎం మృదుభాషిణి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు: సీలేరు ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో స్థానిక వైద్య సిబ్బంది స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రక్త హీనత, పిరియడ్స్ సమయంలో పాటించాల్సిన శుభ్రత తదితర అంశాలపై వైద్యాధికారి అవగాహన కల్పించారు. వైద్యాధికారులు ఎస్‌కే మస్తాన్‌వల్లీ, సృజనారాయ్, హెచ్ఎస్ ఎన్. త్రినాధ్‌పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని వాలసీ పంచాయతీ కేంద్రంలో గురువారం లంగుపర్తి వైద్యాధికారిణి మంజుభార్గవి, రాకేశ్ వైద్యసేవలను అందించారు.. మహిళలకు పలు వైద్య పరీక్షలు చేశారు. సర్పంచ్ సన్యాసిరావు, హెచ్‌వీ. పి.వెంకటలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: మహిళలకు ప్రత్యేక ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తాజంగి పీహెచ్‌సీ వైద్యాధికారి కె. సంతోశ్ కుమార్ బాబు అన్నారు. గురువారం ఆస్పత్రిలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు సంతోశ్ కుమార్‌బాబు, జి. భవాని, ఆయుష్ వైద్యాధికారి ఉదయ్ సందీప్ మహిళలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. సర్పంచ్ వంతల మహేశ్వరి, ఎంపీహెచ్‌ఈవో స్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మహిళల ఆరోగ్యంతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని సర్పం,చి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు గీత అన్నారు. మండల కేంద్రంలో స్వస్థ్ నారీ -శసక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. క్యాన్సర్, రక్తహీణత, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలను నిర్వహించి వ్యాధులపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాంబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రావణాపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ప్రకృతి సాగు మేలు: ఏవో

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు సాధ్యమని మండల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని కొండపడ, లింగాపుట్టు గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది, పొలం బడి కార్యక్రమాలను నిర్వహించారు. గిరి రైతులకు రసాయనిక ఎరువులతో కలిగే అనర్థాలు, ప్రకృతి సాగుతో కలిగే మేలు, పంటల దిగుబడి తదితర అంశాలను రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో పాడేరు డీఆర్‌సీ పాత్రుడు, వ్యవసాయ అధికారులు ప్రవీణ్, సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలని స్థానిక ఏవో డి. గిరిబాబు అన్నారు. గురువారం డోకులూరు, సంకాడ గ్రామాల్లో ఆత్మ సౌజన్యంతో నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు.ఆత్మ ఏటీఎం మహేశ్వరి పాల్గొన్నారు.

చింతపల్లి: గిరిజన రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో మధుసూదన రావుఅన్నారు. గురువారం మండలంలోని గెంజిగెడ్డ గ్రామంలో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రైతుల పంట పొలాల్లో ఈ-క్రాప్ నమోదు చేయించారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ, ఎరువులు, విత్తనాలు, రాయితీ యంత్రాలు పంపిణీ చేస్తామన్నారు.



మాట్లాడుతున్న ఏవో మురళీకృష్ణ

పోషకాహారంతో ఆరోగ్యం

కొయ్యూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని తీసుకోవాలని కొయ్యూరు ఐసీ డీఎస్ సీడీపీవో దేవమణి సూచించారు. గురువారం బంగారమ్మపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్-పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులకు పోషకాహారాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కనక మహాలక్ష్మి, సత్యవతి, రామలక్ష్మి, బాలమణి, బిపిసి సోమ శేఖర్, ఎంఎల్‌హెచ్‌పి వెంకటలక్ష్మి, ఎంఎస్‌కే లక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజుబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో దేవమణి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా అప్పికొండమ్మ పండగ

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలంలోని పాతకృష్ణాదేవిపేటలో అప్పికొండమ్మ పండగ గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారి దర్శనానికి భక్తులు వేకువజాము నుంచే పోటెత్తారు. కొబ్బరికాయ, అరటి పండ్లు, పసుపు, కుంకుమతో పాటు చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయ కమిటీ సభ్యులు పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య అమ్మవారి ఘటాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పందిరి సత్యంనాయుడు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాచపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో సేవలపై ఆరా



విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించిన వైద్య బృందం

మాకవరపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాచపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్స్ బృందం గురువా రం తనిఖీలు నిర్వహించింది. క్లినిక్‌లో రికార్డులు, రోగులకు అందిస్తున్న సేవలు, మందుల నిల్వలు, పరిసరాలు, ఎన్‌సీడీసీ సర్వే, క్లినిక్ నిర్వహణ వంటి అంశాలపై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికా రులు చరిష్మా, సీతామహాలక్ష్మి, క్వాలిటీ కంట్రోల్ అధికారి ఎన్. మణికంఠ, ఎంపీహెచ్‌వో సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్

రావికమతం: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో గురువారం కొత్తకోట గ్రామ సచివాలయం వద్ద వైద్యాధికారులు సురేఖ,రవితేజల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ రోగులతోపాటు కిశోర బాలికలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, ఎంఎల్‌హెచ్‌పీఎస్ చందవ్వ, కళ్యాణి, సౌజన్య, సంతు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: మహిళలు వైద్య పరీక్షలు చేసుకోవాలని వేచలం వైద్యాధికారి రమేషబాబు కోరారు. గురువారం స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమంలో బాగంగా కలిగొట్లలో 75 మందికి పరీక్షలు నిర్వహించారు. అవగాహన కలిగించారు. తెనుగుపూడిలో 156 మందికి పరీక్షలు చేసినటు వైద్యాధికారి వనజ తెలిపారు. మహిళలకు అవగాహణ కలిగించారు. ఏఎన్‌ఎం బేగమ్ పాల్గొన్నారు

వారపు సంతలో ట్రాఫిక్ ఇబ్బందులు

గొలుగొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జోగంపేట వారపు సంతలో ట్రాఫిక్ స్తంభించింది. రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జోగంపేట జంక్షన్‌లో ప్రతి గురువారం వారపు సంత జరుగుతుంది. రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, చేపలు, పండ్ల దుకాణాలు ఏర్పాటు చేస్తుండ డంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలు వురు కోరుతున్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

నర్సీపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం జరిగిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. 550 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా వివిధ కంపెనీల ప్రతినిధులు 212 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రాజు, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అదనపు అధికారి ఎం. బాల, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గౌరీపట్నంలో వైద్యశిబిరం

చోడవరం: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలో గౌరీపట్నంలో వైద్యశిబిరం నిర్వహించారు. వడ్డాది పీహెచ్‌సీ వైద్యాధికారి మాధవి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోన లక్ష్మి, చంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు మంగా జగన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పథకంలో మార్పులు

మాడుగుల, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అవతవకలకు తావులేకుండా పలు మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్టు ఎంపీడీవో గోపాలరావు తెలిపారు. స్థానిక తులసీ కళ్యాణ మండపంలో మాడుగుల క్లస్టర్ పరిధిలో గల ఆరు మండలాల అధికారులతో గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ఏపీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధికూలీలకు యాప్ పెట్టనున్నారని తెలిపారు. పనులను యుక్తాధార్ యాప్ ద్వారా గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో మురళి కృష్ణ, ఏపివోలు, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్ , ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవోను సన్మానిస్తున్న దొండా నరేష్,

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నూతన ఎంపీడీవో శివ ప్రసాద్‌ను టీడీపీ వడ్డాది టౌన్ అధ్యక్షులు దొండా నరేశ్, కూటమి నాయకులు తలారిశంకర్, అకిరెడ్డి కనకరాజు, కోరుకొండ గురుమూర్తి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు దొండా సన్యాసిరావు, కోరుకొండ సూరి అప్పారావు, షేక్ రసూల్, మంగళాపురం గ్రామ అధ్యక్షుడు తుమ్మపాల కన్నంనాయుడు, దిబ్బిడి సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, తదితరు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు అధునాతన ఈ-పోస్ మిషన్లు



డీలర్లకు ఈ-పోస్ మిషన్లు అందిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు అధునాత ఈ-పోస్ మిషన్లను గురువారం పంపిణీ చేశారు. నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని నర్సీపట్నం, మాకవరపాలెం, నాతవరం, గొలుగొండ మండలాల్లో ఉన్న 174 రేషన్ డీలర్ల నుంచి పాత ఈ-పోస్ మీషన్లు తీసుకున్నారు. వాటి స్థానంలో క్యూర్ కోడ్ ఆధారిత, టచ్ స్క్రీన్ కలిగిన కొత్త మిషన్లను ఆర్డీవో వీవీ రమణ పంపిణీ చేశారు. కాగా, నాలుగు మండలాల్లోని రేషన్ డిపోల పరిధిలో 83,773 స్మార్ట్ రేషన్ కార్డులు ఉన్నాయి.

రావికమతంలో యూరియా కోసం బారులు



కొత్తకోట పీఏసీఎస్ వద్ద రైతులు రద్దీ

రావికమతం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):మండలంలో యూరియా విక్రయ కేంద్రాల వద్ద గురువారం రైతులు బారులు తీరారు. సుమారు 40 టన్నుల యూరియా వచ్చింది. కొత్తకోట పీఏపీఎస్ ద్వారా 25 టన్నులు, మేడివాడ, 12 టన్నులు, గుడివాడ ఆరు టన్నుల యూరియాను అధికారులు పంపిణీ చేస్తామని తెలపడంతో రైతులు ఉదయం ఆయా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అధిక సంఖ్యలో రైతులు రావడంతో తోపులాట చోటుచేసుకుంది. వెంటనే వ్యవసాయ అధికారులు పోలీసులను రప్పించారు. ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున యూరియా పంపిణీకి సిద్ధమయ్యారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లతోపాటు గ్రామ సచివాలయ సిబ్బంది, వీఆర్‌వో యూరియా సరఫరా చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉన్నా యూరియా లభించక కొంత మంది రైతులు వెనుతిరిగారు. వ్యవసాయశాఖ అధికారులపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వరికి కలుపు తీసి యూరియా ఎరువు తప్పనిసరిగా వేయాల్సి ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు సహకార సంఘాల ద్వారా రైతులకు ఇచ్చే యూరియా బస్తా రూ. 270 తీసుకుంటుండగా, రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది రూ. 280 వసూలు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా ప్రభుత్వం యూరియా బస్తా ధర రూ.266కే రైతులకు అందించాల్సి ఉంది. ఈ విషయమై ఏవో రమేశ్‌ను వివరణ కోరగా రైతు సేవా కేంద్రాల్లో అధిక ధర వసూలు చేస్తున్న విషయం తన దృష్టికి రాలేదని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

వరహాపురంలో పడిగాపులు

చీడికాడ : వరహాపురం రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు ఉదయం నుంచి పడిగాపులు కాశారు. వరహాపురం, జెబి.పురం, తునివలస, వింటిపాలెం గ్రామాల రైతులు ఉదయం 6 గంటలకే కేంద్రం వద్దకు చేరుకున్నారు. సచివాలయ సిబ్బంది వచ్చి డాక్యుమెంట్లు పూర్తి చేసి రశీదులు అందించారు. ఈ సందర్భంగా ఏఓ కృష్ణవేణి మాట్లాడుతూ 250 బస్తాల యూరియా వచ్చినట్టు చెప్పారు. ఎటువంటి తోపులాటలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



స్పీకర్ అయ్యన్నతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

స్పీకర్ అయ్యన్నకు సమస్యలపై వినతి

గొలుగొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు సమస్యలను టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, తదితరులు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు దృష్టికి తీసుకువెళ్లారు. గురువారం వారు అమరావతిలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనుల గురించి వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో లింగందొరపాలెం మాజీ సర్పంచ్ జి. సత్యనారాయణ కూడా పాల్గొన్నారు.

నేటి నుంచి దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్



సబ్ రిజిస్ట్రార్ కమలకు వినతిపత్రం ఇస్తున్న దస్తావేజు లేఖర్లు

నర్సీపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖర్లు శుక్ర, శనివారం పెన్ డౌన్ చేపట్టనున్నారు. ఈమేరకు ఆ సంఘం నాయకులు సబ్ రిజిస్ట్రార్ కమలకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సున్నం చిదంబర స్వామి మాట్లాడుతూ స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రైమ్-2.0 సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక లోపాలు, ఆన్‌లైన్‌లో దస్తావేజుల ఎడిటింగ్ ఆప్షన్ రద్దు,తదితర వాటిని నిరసిస్తూ రెండు రోజుల పాటు పెన్ డౌన్ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు.

చనిపోయిన కోళ్లను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తే చర్యలు

» చోడవరం పశు సంవర్ధకశాఖ ఏడీ శ్రీనివాసరావు



చోడవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చనిపోయిన కోళ్ళ, వాటి వ్యర్థాలు పారేయడంలో నిబంధనలు పాటించని పౌల్ట్రీ యజమానులపై క్రిమినల్ కేసులు తప్పవని స్థానిక పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ జి. శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పౌల్ట్రీ యజమానులు చనిపోయిన కోళ్లను నీటి వనరులైన చెరువులు, బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని సూచించారు. కోళ్ల పెంపకంతో పాటు. చనిపోయిన కోళ్ల విషయంలో పెంపకందారులు కొన్ని సురక్షిత పద్ధతులు పాటించాలని తెలిపారు. పౌల్ట్రీ పరిసరాల్లో పరిశుభ్రత కచ్చితంగా పాటించాలని, షెడ్‌లలో ప్రవేశించే ముందు చేతులు, కడుక్కోవడం శానిటైజేషన్ చేసుకోవాలని సూచించారు. కోళ్లకు వేసే మేత, నీరు పరిశుభ్రంగా ఉండే చూసుకోవాలని, కొత్తగా తెచ్చే కోళ్లను 15 రోజులు క్వారంటైన్‌లో ఉంచి ఆ తరువాతే మిగిలిన వాటితో కలవాలని తెలిపారు. కోళ్లలో వ్యాధుల లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని కోరారు. చనిపోయిన కోళ్ల ను ప్లాస్టిక్ కవర్లలో చుట్టి కనీసం 3 నుంచి 4 అడుగుల లోతైన గోతులు తవ్వి వాటిలో పూడ్చి పెట్టాలని సూచించారు. వాటిపై లైమ్ పౌడర్ చల్లాలని, తరువాత ఆ పరిసరాల్లో బ్లీచింగ్ చేయాలని తెలిపారు. చనిపోయిన కోళ్లను తగలబెట్టకూడదని స్పష్టం చేశారు.ఈ నిబంధనలు పాటించని యజమానులపై జంతువుల వ్యాధిసంక్రమణ, అంటువ్యాధుల నివారణ చట్టం 2009 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఏడీ హెచ్చరించారు.

రావికమతం ఎంపీడీవోగా మహేశ్



ఎంపీడీవోను కలిసిన టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

రావికమతం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా ఒ. మహేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చోడవరం ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడకు బదిలీపై వచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు, సిబ్బంది తదితరులు ఎంపీడీవోకు స్వాగతం పలికి పుష్ప గుచ్చాలందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కొనసాగుతున్న సీతారామ స్వామి మహేశ్‌కు పదవీ బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఆయనను ఎంపీపీ పైల రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీడీవో ఒ.మహేష్‌ను టీడీపీ మండల అధ్యక్షులు కోమటి శంకరావు ఆధ్వర్యంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షులు రాజాన కొండనాయుడు, అర్జాపురం సర్పంచ్ మడగల ఫాల్గుణ, రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, గొంప ఎంపిటీసీ గంజి సూర్యనారాయణ,చోడవరం ఏఎంసీ డైరెక్టర్ గొర్లె సాంబ శివ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ నేత కంచిపాటి జగన్నాథరావు, వైస్ ఎంపిపీలు దంట్ల వెంకటరమణ, మత్సా భవానీ ప్రసాద్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బంటు సన్యాసినాయుడు, తదితరులు ఎంపీడీవోను కలిశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

బుచ్చెయ్యపేట సెప్టెంబరు18 (ఆంధ్ర జ్యోతి): మండలంలో విజయరామరాజు పేట పీఏసీఎస్‌లో గురువారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నేత వైద్య శిబిరం నిర్వహించారు. 98 మందికి పరీక్షలు నిర్వహించి, ,30 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్స్ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ దొడ్డి కిశోర్, సెక్రటరీ జగన్, సభ్యులు ,కర్రి తమ్మునాయుడు, అష్టమాలిక్ ఆఫీసర్ దుర్గాభవాని, మేనేజర్ ఎం. అరుణ కుమార్,దేవి సిబ్బంది పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

చిననందిపల్లిలో ...

దేవరాపల్లి : మండలంలోని చిననందిపల్లిలో ఎల్.వి.ప్రసాద్ హాస్పిటల్ సిబ్బంది 120 మందికి గురువారం పరీక్షలు నిర్వహించారు.క్లాసిక్ ఎంటర్ ప్రైజెస్ యజమాని మూర్తి తదితరులు ప్రోత్సాహంతో ఈ శిబిరం నిర్వహించారు.30 మంది కంటి శస్త్ర చికిత్సలకు, మరో 20 మందికి కళ్ల అద్దాలు అవసరమని నిర్ధారించారు. ఈ శిబిరంలో విజన్ టెక్నీషియన్ రాజేశ్వరి, శ్రావ్య, సమన్వయ కర్త శివ తది తరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాడుగుల రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గాదిరాయి సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నర్సీపట్నం ఈఈ అప్పారావు తెలిపారు.ఒమ్మలి, విజెపురం, గాదిరాయి, సత్యవరం, డి.గొటివాడ, కొత్తవలస, వెలంపాడు, జేడీపేట, కింతలి, కింతలి వల్లాపురం, ఎం.కృష్ణాపురం గ్రామాలకు సరఫరా ఉండదని చెప్పారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టిహకార ప్రదర్శనను పరిశీలిస్తున్న సీడీపీవో శ్రీగౌరి, వైద్యాధికారి జ్యోతి

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని గొలుగొండ ఐసీడీఎస్ సీడీపీవో శ్రీగౌరి అన్నారు. గురువారం ఏఎల్‌పురంలో జరిగిన పౌష్టిహకార మాసోత్సవాల్లో ఆమె మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేసి, రికార్డులను పరిశీలించారు.అలాగే కేంద్రంలో రూ. లక్షన్నర మండల పరిషత్ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్. గాయత్రి, జ్యోతి, హేమ, అంగన్‌వాడీ కార్యకర్తలు మంగతాయారు, ధనలక్ష్మి, భవాని, రాజకుమారి, రాజేశ్వరి, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : మహిళలు ఆరోగ్యంతో మెరుగైన సమాజం సాధ్యమని తహసీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో మహేష్ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీవో వి. మంగతాయారు అధ్యక్షతన 8వ పోషణ్ మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. ఈ సందర్భంగా నాలుగు మండలాలకు చెందిన అంగన్‌వాడీలు తయారు చేసిన పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్, ఎంపీడీవోలు మాట్లాడుతూ, గ్రామాల్లో అంగన్‌వాడీలు గర్భిణులు, పిల్లలకు పోషకాహారం సక్రమంగా అందించాలన్నారు. సీడీపీవో మంగతాయారు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన 'బూడి'



జగన్మోహన్‌రెడ్డి మొక్క అందిస్తున్న అనూరాధ, ముత్యాల నాయుడు

దేవరాపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వైసీపీ జోన్- 1 మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె.అనూరాధ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడంపై అనూరాధ జగన్ ప్రత్యేక కృతజ్ఞలు తెలిపారు. నియోజకవర్గ రాజకీయాలపై జగన్మోహన్‌రెడ్డి ఆరా తీశారన్నారు.

డైట్ అధ్యాపక బృందం పాఠశాలల సందర్శన

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో గున్నెంపూడి, పెదమదిన పాఠశాలలను గురువారం డైట్ అధ్యాపక బృందం సందర్శించింది. విద్యా ప్రమాణాలు, మాల్యాంకనం గ్రేడింగ్ విధానాన్ని పరిశీలించారు. సిలబస్ ఏ మేరకు పూర్తయిందో తెలుసుకున్నారు. బోధనలో ఉపాధ్యాయులకు సూచనలందించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ స్వామి, ఎస్‌కే అల్లావుద్దీన్, ఎంపీ రమణ, ఉదయ్ శేఖర్, హెచ్‌ఎంలు వీవీఎస్ స్వామి, శ్యాండిల పాల్గొన్నారు.

వరి రైతులకు తెగుళ్ల నివారణపై సూచనలు



మత్సవానిపాలెంలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

రావికమతం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వరిలో ఆశించిన దోమ నివారణకు చర్యలు తీసుకోవాలని కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రాజ్‌కుమార్ చెప్పారు. రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మత్సవానిపాలెంలోని వరి పంటను కేవీకే శాస్త్రవేత్తల బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు వరిలో దోమ తెగులును గుర్తించారు. అనంతరం రాజ్‌కుమార్ మాట్లాడుతూ దోమ ఉధృతి తగ్గించేందుకు ఎకరాకి 10 పసుపు రంగు, నీలి రంగు జీరు బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఎసిపేట్ 1.5 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్.సత్తిబాబు, డాక్టర్ సౌజన్య, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి తిరుమలరావు, పాల్గొన్నారు.

దేవరాపల్లి : వరి దుబ్బులను ఆశించే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఏఓ ఎల్.వై. కాంతమ్మ సూచించారు. గురువారం ఆమె కొత్తపెంట, బి.కింతాడ గ్రామంలో వరి పంటను పరిశీలించి, రైతులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాబూరావు, కిరణ్ కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోలుగుంట : రైతులు నానో యూరియా వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని ఏడీ శ్రీదేవి చెప్పారు. గురువారం ఆమె మండలంలోని కొంతలం గ్రామంలో అధికారులతో కలిసి వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఓలు చిరంజీవి, ఆత్మ బీటీఎం లక్ష్మి, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఓపై చర్యలు తీసుకోవాలి

మాకవరపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తమ వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న కొండల అగ్రహారం వీఆర్ఓపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన రైతులు తహశీల్దార్ జి. వెంకటరమణకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండల అగ్రహారంలో ఇటీవల భూములను రీసర్వే చేశారన్నారు. రీసర్వే పూర్తయిన వారికి రెవెన్యూ అధికారులు 92 నోటీసులు జారీ చేయాల్సి ఉండగా వీఆర్ఓ నోటీసు కావాలంటే రూ. 5 వేలు నుంచి రూ.8 వేల ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే కొంతమంది ఆమెకు నగదు చెల్లించి నోటీసులు తీసుకున్నారన్నారు. చాలామందికి నోటీసులు అందకపోవడంతో భూముల వివరాలు తెలియడం లేదన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు



ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ వేణుగోపాల్

నాతవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ వేణుగోపాల్ హెచ్చరించారు. నాతవరంలో సర్వే నెంబరు 285, 289లో ఉన్న ప్రభుత్వ స్థలం. గెడ్డను కొందరు ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తుండడంతో స్పందన కార్యక్రమంలో గవిరెడ్డి నాగన్నదొర తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు తహశీల్దార్ మండల సర్వేయర్ సత్యనారాయణతో కలిసి ఆక్రమణకు గురైన స్థలాలను గురువారం పరిశీలించారు. ఆక్రమణదారులకు నోటీసులిచ్చి నిర్మాణాలను తొలగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లాలం శేషు, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న విజయ్

గొలుగొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణలో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. గురువారం ఆయన గుండుపాల ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వీర సూర్యచంద్ర, నాయకులు కె. రవి వర్మ, చోద్యం పీఏసీఎస్ డైరెక్టర్ శివ, జనసేన నాయకులు ఊడి చక్రవర్తి, చినబ్బాయి పాల్గొన్నారు.

ఘనంగా జనసేన నాయకుడు దొరబాబు జన్మదిన వేడుకలు



దొరబాబును సన్మానిస్తున్న కార్యకర్తలు

నర్సీపట్నం అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జనసేన సీనియర్ నాయకుడు అప్పన దొరబాబు జన్మదిన వేడుకలు పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ధర్మసాగరం దగ్గరలో మొక్కలు నాటడంతో పాటు నర్సీపట్నం టౌన్‌లో 70 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అద్దేపల్లి గణేశ్, మారిశెట్టి రాజా, లంక సతీశ్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నిరసన భగ్నం

నర్సీపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన నిరసనను పోలీసులు భగ్నం చేశారు. గురువారం పెదబొడ్డేపల్లిలోని నివాసం నుంచి మాజీ ఎమ్మెల్యే గణేశ్, నాయకులు నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియంకు బయలుదేరారు. వారిని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ వద్ద పట్టణ పోలీసులు అడ్డుకున్నారు. నిరసనకు అనుమతి లేదని, పది మందితో వచ్చి వినతి పత్రం ఇచ్చి వెళ్లిపోతే అభ్యంతరం లేదని సీఐ గోవిందరావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే గణేశ్, నర్సీపట్నం, మాకవరపాలెం వైసీపీ నాయకులు రోడ్డుపై బైఠాయించి, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని, పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. పోలీసులు గణేశ్‌ను అదుపులోకి తీసుకొని మాకవరపాలెం స్టేషన్‌కు తరలించారు. మిగిలిన నాయకులను కోటవురట్ల, నర్సీపట్నం స్టేషన్‌లకు తరలించారు.

ఘనంగా పశువుల పండుగ

చీడికాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంచాల, జైతవరం, ఎం.గదబూరు గ్రామాల్లో గురువారం పశువుల పండగను ఘనంగా నిర్వహించారు. వరినాట్లు తరువాత ఉత్తరకార్తెలో ఈ పండగను నిర్వహిస్తారు. పొలాల్లో పంటలు, పాడిపశువులు సరక్షితంగా ఉండాలని అమ్మవారికి పూజలు చేశారు.

స్వయంభూ దేవాలయాలపై చారిత్రక పరిశోధన

- దేవాలయాల ప్రాచుర్యంపై ప్రభుత్వానికి సూచనలు
- చారిత్రక పరిశోధకుడు డాక్టర్ కావూరి శ్రీనివాస్



కావూరి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

చోడవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చోడవరంలోని స్వయంభూ విఘ్నేశ్వర, స్వయంభూ గౌరీశ్వర ఆలయాల చరిత్రపై పరిశోధన చేస్తామని ప్రముఖ చారిత్రక పరిశోధకుడు డాక్టర్ కావూరి శ్రీనివాస్ తెలిపారు. పూర్వ విద్యార్థుల ఆహ్వానంపై స్వయంభూ ఆలయాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం కలిగిన స్వయంభూ ఆలయాలు ఒకే చోట ఉండడం అరుదైన విషయమన్నారు. ఈ ఆలయాల చారిత్రక ఆనవాళ్ల వెలికి తీయడంతో పాటు చరిత్రను నిక్షిప్తం చేస్తామన్నారు. ఆలయాల ప్రాచుర్యానికి సంబంధించి ప్రభుత్వానికి సూచనలు చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు కాండ్రేగుల డేవిడ్, శరగడం సాయి, స్వయంభూ గౌరీశ్వరాలయం చైర్మన్ గూనూరు సురేశ్, అర్చకులు కొడమంచిలి చలపతి, నాయకులు గోపి, రత్న, వర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షునిగా పట్టాభి



విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కు లోకల్ అడ్వయిజరీ కమిటీ (విశాఖపట్నం) అధ్యక్షునిగా టీడీపీ సీనియర్ నేత చోడే వెంకట పట్టాభి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం అధికారికంగా ప్రకటన చేసింది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో టీటీడీ దేవాలయాలు, కల్యాణ మండపాల్లో జరిగే కార్యకలాపాల పర్యవేక్షణ పట్టాభి చూడాల్సి ఉంటుంది. టీటీడీ బోర్డు సభ్యునికి ఉండే అధికారాలు, సదుపాయాలు లోకల్ అడ్వయిజరీ బోర్డు అధ్యక్షునికి ఉంటాయి. ఈ సందర్భంగా పట్టాభి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామికి సేవ చేసుకునే భాగ్యం కలిగిందన్నారు. ఉత్తరాంధ్రలో టీటీడీ దేవాలయాలు, కల్యాణ మండపాలు అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజల్లో భక్తిభావం పెంపొందించేలా టీటీడీ తరపున కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషిచేస్తానన్నారు. ఎంవీపీ కాలనీలో టీటీడీ కల్యాణ మండపాన్ని 2009లో అప్పటి పాలకులు ప్రైవేటుపరం చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తే ధర్నా చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే కైలాసగిరిపై వెంటేశ్వరస్వామి దేవాలయం నిర్మించాలని సీఎం చంద్రబాబును అప్పట్లో కోరగా, రుషికొండలో దేవాలయం నిర్మాణానికి భూమి కేటాయించారన్నారు. తనకు లోకల్ అడ్వైజరీ అధ్యక్షునిగా నియమించిన సీఎంకు పట్టాభి ధన్యవాదాలు తెలిపారు. కాగా, ఆయన గతంలో జీవీఎంసీ కార్పొరేటర్‌గా, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించారు.

మరింత చేరువగా రూఫ్ టాప్!

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం కింద రూఫ్ టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకోవడానికి విద్యుత్ పంపిణీ సంస్థలు నిబంధనలు సడలిస్తున్నాయి. తాజాగా డిస్కమ్ పరిధిలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకుని ప్రయోజనం పొందేలా అవకాశం కల్పించారు. దీనిద్వారా వీలైనంత ఎక్కువ మందికి పథకం అందించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

పీఎం సూర్య ఘర్‌లో మారిన నిబంధనలు

- ఎక్కడ సొంత ఇల్లు ఉన్నా అమర్చుకోవచ్చు
- నివసించే చోట విద్యుత్ వినియోగించుకునే వీలు
- ఈపీడీసీఎల్ పరిధిలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు అవకాశం



పథకం ప్రారంభంలో ఏడాదికి రూ.1.5 లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి మాత్రమే రాయితీ లభిస్తుందని ప్రకటించారు. ఆ తరువాత ఈ పరిమితి ఎత్తేశారు. సొంత ఇల్లు ఉన్న వారు ఇంటి పై కప్పుపై దీనిని ఏర్పాటు చేయాలి. అయితే విశాఖ లాంటి నగరాల్లో ఎక్కువ సంఖ్యలో ప్లాట్లు, అపార్ట్‌మెంట్లపై వ్యక్తిగతంగా సోలార్ ప్లేట్లు ఏర్పాటుకు అసోసియేషన్లు అనుమతి ఇవ్వకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఆలోచన చేశారు. ఫ్లాట్‌లో నివసించే వినియోగదారులకు జిల్లాలో ఎక్కడైనా సొంత ఇల్లు, స్థలం ఉంటే.. అక్కడ ఏర్పాటు చేసుకుని, దాని ద్వారా లభించే సోలార్ విద్యుత్‌ను ఫ్లాట్‌లో వాడుకునే వీలు కల్పించారు. దీనివల్ల కూడా పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. ఎక్కడెక్కడి నుంచో ఉద్యోగ, ఉపాధి రీత్యా వచ్చి నగరంలో స్థిర పడిన వారికి లబ్ధి కలగాలంటే పరిధి విస్తృతం చేయాలని భావించారు. ఇందులో భాగంగా ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలో అంటే శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు వరకు ఎక్కడైనా సరే రూఫ్ టాప్ సోలార్ పెట్టుకుంటే, దానిని విశాఖలో నివాసం ఉండే ఫ్లాట్‌కు లింక్ చేసుకునే అవకాశం కల్పించారు. ఉదాహరణకు సీతమ్మధారలోని అపార్ట్‌మెంట్‌లో ఉండే వినియోగదారునికి శ్రీకాకుళం జిల్లా కవిటిలో సొంత స్థలం లేదా పొలం ఉండి, అక్కడ రూఫ్ టాప్ సోలార్ పెట్టుకుంటే.. అక్కడ ఉత్పత్తి అయ్యే సోలార్ పవర్‌ని విశాఖలో ఫ్లాట్‌కు లింక్ చేసి ఉపయోగించుకునే అవకాశం కల్పించారు. రెండు చోట్లా యజమాని ఒక్కరే కావడంతో దీని అమలుకు ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్నారు.

ఎంత ప్రయోజనం అంటే...?

ఒక్కో వినియోగదారుడు మూడు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకునే వీలుంది. ఒక కిలోవాట్ ద్వారా రోజుకు నాలుగు యూనిట్ల చొప్పున నెలకు 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. దీనికి అయ్యే వ్యయం రూ.60వేలు. అందులో ప్రభుత్వం రూ.30వేలు రాయితీ ఇస్తుంది. రెండు కిలోవాట్లకు నెలకు 240 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. రూ.60వేలు రాయితీ వస్తుంది. మూడు కిలోవాట్లు పెట్టుకుంటే రూ.78వేలు రాయితీ లభిస్తుంది. నెలకు 360 యూనిట్ల సోలార్ విద్యుత్ వస్తుంది. సగటు వినియోగదారులకు ఈ పథకం సరిపోతుంది. ఇందుకు అయ్యే మొత్తం రుణంగా ఇచ్చేందుకు బ్యాంకులు కూడా ముందుకు వస్తున్నాయి. కేవలం రూ.వెయ్యి డౌన్ పేమెంట్‌తో మూడు కిలోవాట్ల పథకం పెట్టుకోవచ్చు. నెల నెలా కట్టే విద్యుత్ బిల్లును ఐదేళ్లు ఈఎంఐల కింద బ్యాంకుకు చెల్లిస్తే రుణం తీరిపోతుంది. రూఫ్‌టాప్ సోలార్ జీవిత కాలం 25 ఏళ్లు. ఐదేళ్లకు ఈఎంఐలు కడితే మిగిలిన 20 ఏళ్లకు వచ్చే విద్యుత్ ఉచితమే.

విస్తృత ప్రచారం చేస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో పదివేల మందికి పీఎం సూర్య ఘర్ పథకం అందించాలని లక్ష్యంగా నిర్దేశించింది. దీనిపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. డిస్కమ్ పరిధిలో 1,16,364 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఇప్పటివరకు 23,362 మందికి ఏర్పాటు చేశాం. మరో 574 గ్రౌండింగ్ దశలో ఉన్నాయి. 4,084 ఇన్‌స్టాలేషన్‌కు వెయిటింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 11,897 మంది పేర్లు నమోదు చేసుకోగా 2,910 మందికి అమర్చాం. వీటి సంఖ్య పెంచడానికి విస్తృత ప్రచారం చేస్తున్నాం.

– పృథ్వీతేజ్, సీఎండీ, ఈపీడీసీఎల్

రైల్వే పనులు త్వరితగతిన పూర్తి : కలెక్టర్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే అభివృద్ధి పనులను త్వరతగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. లక్ష్మీదేవిపేట ఫ్లైఓవర్ వంతెనను కలెక్టర్, రైల్వే ఇంజినీరింగ్ అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే వంతెన నిర్మాణ మ్యాప్‌ను కలెక్టర్‌కు చూపించారు. ఇరువైపులా వంతెన నిర్మాణంతో పోయే స్థలాల వివరాలను రైల్వే అధికారులు వివరించారు. అలాగే గూడ్స్‌షెడ్ జంక్షన్, లక్ష్మీనారాయణనగర్‌కు వెళ్లే జంక్షన్‌ల్లో రోడ్డు విస్తీర్ణం ఎంత ఉందో కొలతలు వేయించారు. అనంతరం రైల్వేస్టేషన్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. స్టేషన్ రెండు, మూడు ప్లాట్‌ఫారాల మధ్య జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్లాట్‌ఫారాలపై ఏర్పాటు చేసే వెయింటింగ్ రూమ్‌లను ఏ విధంగా నిర్మిస్తారో అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు స్వయంగా పరిశీలించారు. పనులు ఎప్పటికి పూర్తవుతాయని కలెక్టర్ ఆరా తీశారు. పనులను త్వరతగతిన పూర్తిచేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, ఇన్‌చార్జి తహశీల్దార్ శాంతిభూషణరావు, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల్లో శతశాతం ఫలితాలు

... 5వ పేజీ తరువాయి

బోధిస్తున్న పాఠ్యాంశాలపై ఇంటికి వెళ్లి పునః పరిశీలన చేసుకోవాలన్నారు. విద్యార్థులంతా పాఠశాలలకు రెగ్యులర్‌గా హాజరయ్యేలా చూడాలన్నారు. అనంతరం నక్కపల్లి గురుకులాన్ని తనిఖీ చేశారు. విద్యార్థినుల ప్రగతిని పరిశీలించారు. గురుకులం టీచర్లకు పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో డీఈవో జి. అప్పారావు నాయుడు, ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు, ఎంఈవోలు నరేశ్, నాగన్న దొర, సీనియర్ హెచ్‌ఎంలు వేమగిరి నూకరాజు, జయశ్రీ, శ్రీలక్ష్మి, వరలక్ష్మి, ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, టీవీ రమణ పాల్గొన్నారు.

జీజేసీ ప్రిన్సిపాళ్ల సంఘ జిల్లా అధ్యక్షుడిగా వినోద్‌బాబు



వినోద్‌బాబు

అనకాపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పరవాడ జీజేసీ ప్రిన్సిపాల్, జిల్లా ఇన్‌చార్జి ఇంటర్మీడియట్ అధికారి మద్దిలి వినోద్‌బాబు ఎన్నికయ్యారు. అనకాపల్లిలో గురువారం జరిగిన ప్రిన్సిపాళ్ల సమావేశంలో వినోద్‌బాబును జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కృష్ణాదేవిపేట జీజేసీ ప్రిన్సిపాల్ కె.శ్రీహరి, ప్రధాన కార్యదర్శిగా నర్సీపట్నం జీజేసీ ప్రిన్సిపాల్ ఎ.శోభ, సంయుక్త కార్యదర్శిగా కోటవురట్ల జీజేసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఆర్‌టీ సుజాత, మహిళా కార్యదర్శిగా కొత్తకోట జీజేసీ ప్రిన్సిపాల్ ఎల్.సత్యవతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎలమంచిలి ఎంపీపీపై అవిశ్వాసం

... 5వ పేజీ తరువాయి

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏడుగురు ఎంపీటీసీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు గెలిచారు. ఎంపీపీగా బోదెపు గోవింద్, వైస్ ఎంపీపీలుగా రాజాన శేషు, ఎస్.ఉమ ఎన్నికయ్యారు. తరువాత జరిగిన పరిణామాలతో వైస్ ఎంపీపీ రాజాన శేషు వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరారు. మండలంలో ఏడు ఎంపీటీసీ స్థానాలకుగాను ఏటికొప్పాక-2 ఎంపీటీసీ సభ్యురాలు నగిరెడ్డి దేవుడమ్మ మరణించడంతో ఆ స్థానం భర్తీ కాలేదు. మిగిలిన ఆరు ఎంపీటీసీ స్థానాల్లో రాజాన శేషు (రేగుపాలెం), ఎస్.ఉమ (జంపపాలెం), బర్రె శివలక్ష్మి(కొత్తలి), నగిరెడ్డి అమ్మాజీ(ఏటికొప్పాక-1)లు ఊటీ వెళ్లారు. వీరు బయలుదేరే ముందు ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను కలిశారు. అనంతరం వైస్ ఎంపీపీ రాజాన శేషు ఆధ్వర్యంలో ఊటి వెళ్లడంతో ఎలమంచిలి మండల పరిషత్ రాజకీయం వేడెక్కింది. ఈ విషయాన్ని వైఎస్ ఎంపీపీ రాజాన శేషును ఫోన్‌లో ప్రస్తావించగా.. తనతో సహా నలుగురు ఎంపీటీసీ సభ్యులతో కలిసి ఊటీలో ఉన్నామన్నారు. ఈ నెల 24 వ తేదీన అవిశ్వాస నోటీసు ఇవ్వనున్నట్టు చెప్పారు.

అన్న క్యాంటీన్లు అదుర్స్

... 5వ పేజీ తరువాయి

భోజనం చేశారు. రైల్వే స్టేషన్ వద్ద గల క్యాంటీన్‌లో 2,46,165 మంది, నర్సీపట్నం ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద 2,26,631 మంది, ఎలమంచిలి తహశీల్దార్ కార్యాలయం వద్ద 1,99,876 మంది భోజనాలు చేసి కేవలం రూ.5లకే కడుపు నింపుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో టీ సైతం రూ.10లకు అమ్ముడవుతుంది. హోటల్‌లో టిఫిన్ తినాలంటే కనీసం రూ.50లు ఖర్చు అవుతుంది. భోజనమైతే రూ.100 తక్కువ లేకుండా ఉంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించి కేవలం రూ. 5లకే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాటు చేయడం పట్ల బడుగు, బలహీనవర్గాల్లో ఆనందం వెల్లువిరిసింది. ఆస్పత్రులకు వెళ్లే సమయంలో సహాయకులకు తక్కువ ఖర్చుతో భోజనం చేసేవారు. ప్రైవేటు కంపెనీల్లో తక్కువ వేతనాలకు పనిచేసేవారు. రిక్షావాలాలు, ఆటోవాలాలు, పేదలు, గ్రామీణ ప్రాంతాల నుంచి పనులపై పట్టణాలకు వచ్చేవారు అన్న క్యాంటీన్లల్లో రుచికరమైన భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

రహదారులు ఛిద్రం

... 5వ పేజీ తరువాయి

అనకపల్లి మీదుగా పరవాడ మండలం లంకెలపాలెం వెళ్లే రోడ్డు పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ రోడ్డుపై గుంతలు పూడ్చినప్పటికీ వర్షాల దెబ్బకు పెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. భీమునిపట్నం నుంచి నర్సీపట్నం (బీఎన్) రోడ్డు పరిస్థితి ఇటీవల కురిసిన వర్షాలకు మరీ దారుణంగా తయారైంది. గంధవరం నుంచి రోలుగుంట వరకు 45 కిలోమీటర్ల రోడ్డు, వడ్డాది నుంచి మాడుగుల నియోజకవర్గం పరిధిలోని ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి పాడేరు వెళ్లే రోడ్డులో తాటిపర్తి వరకు 15 కిలోమీటర్ల రోడ్డు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న తీరున ఉంది. బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిపై వంతెన కాజ్‌వే గత వైసీపీ ప్రభుత్వం హయాంలోనే కొట్టుకుపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కాజ్‌వే కూడా కొట్టుకుపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. మాడుగుల, నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం రాకపోకలు సాగించే బస్సులను కొద్ది రోజులపాటు చీడికాడ, గౌరీపట్నం వైపు ట్రాఫిక్ మళ్లించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ రోడ్డు కోర్టు వివాదంలో ఉండడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో చోడవరం శివారు కొత్తూరు ప్రాంతం నుంచి వడ్డాది వెళ్లే రోడ్డుపై పెద్ద గొయ్యిలు ఏర్పడడంతో ప్రయాణికులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. రాంబిల్లి మండలంలోని సంతపాలెం నుంచి వెల్చూరు మీదుగా పెదకలవాలపల్లి వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బ తినడంతో ఆ ప్రాంతంలో రాకపోకలకు వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు గ్రామీణ మండలాలను కలిపే ప్రధాన రోడ్లను బాగు చేసేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా అనకాపల్లి

... 5వ పేజీ తరువాయి

నిరుద్యోగులు పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, అక్టోబరు ఒకటిన ఆటో డ్రైవర్లకు రూ. 15వేలు సహాయం అందించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో శ్మశానవాటికలు నిర్మించేందుకు దరఖాస్తులు స్వీకరించాలని, మేకలు,గొర్రెల పెంపకానికి పీఎంఈజీపీ కింద దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం స్థల పరిశీలన చేయాలని తెలిపారు. మలేరియా, డెంగ్యూ, డయేరియా నివారణకు క్లోరినైజేషన్ చేయాలని, పైపులైన్ లీకేజీలను వెంటనే సరిచేయాలని సూచించారు. అటవీ శాఖ ద్వారా కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేయాలని, ఎక్సైజ్ శాఖ ద్వారా బెల్టుషాపులు లేకుండా చూడాలని, మైనింగ్ శాఖ వారానికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని, కమర్షియల్ టాక్స్ శాఖ ప్రతి ఆస్తికి పన్ను రశీదు జారీ చేసి డిజిటల్ స్వర్ణాంధ్ర యాప్‌లో పోస్ట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జేసీ ఎం. జాహ్నవి, డీఆర్‌వో వై. సత్యనారాయణరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రసూతి సేవల్లో పురోగతి

... 5వ పేజీ తరువాయి

ఓపీ చూస్తున్నారు. దీంతో గైనికాలజీ ఓపీ విభాగంలో వేగంగా పరీక్షలు చేయగలుగుతున్నారు. డెలివరీ కేసులను విశాఖపట్నం రిఫర్ చేయడం దాదాపు తగ్గిపోయింది. గైనికాలజీ ఓపీ విభాగంలో రోజూ సగటున 120 మందికి పరీక్షలు చేస్తున్నారు. మంగళ, శుక్రవారాలు మినహా మిగిలిన రోజుల్లో గర్భిణులు ఎక్కువగా వస్తున్నారు.

రబీ సీజన్‌లో రూ.340 కోట్ల రుణాలు

... 5వ పేజీ తరువాయి

ఆర్థిక సంవత్సరంలో రూ.మూడు వేల కోట్ల వ్యాపార లక్ష్యం కాగా ఇంతవరకూ రూ.2,700 కోట్లు చేశామన్నారు. స్వయంశక్తి సంఘాలకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకు సిద్ధంగా ఉందన్నారు. వాణిజ్య బ్యాంకుల కంటే తక్కువకు అంటే ఏడు శాతం వడ్డీకి డీసీసీబీ రుణాలు అందజేస్తోందన్నారు. ఇంకా రుణానికి సంబంధించి ప్రాసెసింగ్ ఫీజు రూ.4,000 చెల్లించనవసరం లేదన్నారు. అలాగే ఇళ్ల రుణాల పరిమితి పెంచామని, నిర్మాణ వ్యాపారాలకు రుణాలు ఇస్తామన్నారు. రైతులకు ప్రమాద బీమా మొత్తాన్ని పెంచాలనే ప్రతిపాదన బ్యాంకు పరిశీలిస్తోందన్నారు. ప్రస్తుతం ప్రమాదవశాత్తూ రైతు మరణిస్తే రూ.రెండు లక్షలు, సహజ మరణానికి 58 ఏళ్ల కంటే తక్కువ ఉంటే రూ.30 వేలు, పైబడితే రూ.15 వేలు సాయం ఇస్తున్నామన్నారు. అయితే ఏళ్ల తరబడి సొసైటీతో కలిసి ప్రయాణించే రైతు మరణిస్తే తగిన సాయం అందించాలన్న యోచనతో రైతు, సొసైటీ, బ్యాంకు, ఆప్కాబ్ కలిసి ప్రీమియం చెల్లించేలా ఒక ప్రతిపాదన రూపొందించామని తాతారావు చెప్పారు.

క్రైం... crime news

కారు ఢీకొని లారీ క్లీనర్ మృతి



జియాఉద్దీన్ (ఫైల్)

నక్కపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదుళ్లపాలెం జాతీయ రహదారి కూడలిలో కారు ఢీకొని లారీ క్లీనర్ మృతి చెందాడు. పెదదొడ్డిగల్లు గ్రామానికి చెందిన జియావుద్దీన్ (40) కొంత కాలంగా లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా వెదుళ్లపాలెం కూడలిలో బుధవారం అర్ధరాత్రి లారీ దిగి టీ తాగడానికి రోడ్డు దాటుతున్నాడు. ఈ సమయంలో విశాఖపట్నం నుంచి తుని వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో జియావుద్దీన్ అక్కడిక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వారు చెప్పారు.

మహిళ ఆత్మహత్య

నర్సీపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చీరతో ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. పట్టణ సీఐ గోవిందరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గచ్చపువీధికి చెందిన గొర్లి శాంతికుమారి భర్త గోవింద్ మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి శాంతికుమారి తన ఇద్దరు పిల్లలతో అమ్మగారి ఇంటి వద్ద ఉంటుంది. భర్త చనిపోయాడన్న మనస్తాపంలో బుధవారం సాయంత్రం శాంతి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. ఆమె తల్లి గమనించి స్థానికుల సహాయంతో ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు డ్యూటీ డాక్టర్ చెప్పారని సీఐ తెలిపారు. మృతిరాలి తల్లి పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

లారీని ఢీకొని ఆటో డ్రైవర్ దుర్మరణం



ప్రమాదంలో నుజ్జయిన ఆటో... పక్కన మృతి చెందిన డ్రైవర్ అప్పారావు

సబ్బవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో మర్రిపాలెం టోల్ ప్లాజా వద్ద గురువారం వేకువజామున ఆగి ఉన్న లారీని ఢీకొని ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వెన్నెపూడి గ్రామానికి చెందిన దూలిపల్లి అప్పారావు (42) గురువారం రాత్రి చేగోడీలు, జంతికల (బాక్సులు) లోడ్‌తో కాకినాడ నుంచి విజయనగరంకు వెళ్తున్నాడు. గురువారం తెల్లివారుజామున 4 గంటల సమయంలో మర్రిపాలెం జాతీయ రహదారిపై టోల్ ప్లాజా వద్ద బ్రేక్ డౌనైన లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్ అప్పారావుకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలియగానే సీఐ జి.రామచంద్రరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. లారీ డ్రైవర్, లారీని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

- ఎక్స్‌కవేటర్, మూడు లారీలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మూడు లారీలు, ఎక్స్‌కవేటర్‌తో ఎస్ఐ

కొత్తూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న ఒక ఎక్స్‌కవేటర్, మూడు లారీలను స్వాధీనం చేసుకున్నట్టు అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ గురువారం తెలిపారు. అనకాపల్లి మండలంలోని చినసంపతిపురం వద్ద కేబీ రోడ్డును ఆనుకుని వుడాకు కేటాయించిన స్థలంలోని కొండను అక్రమంగా తవ్వుతున్నట్టు సమాచారం అందిందని చెప్పారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి వెళ్లగా, అక్కడ తవ్వకాలకు ఉపయోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌తో పాటు మూడు లారీలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటిని మైన్స్ అధికారులకు అప్పగించామని ఎస్ఐ చెప్పారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

పరవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలోని జాలారిపేటలో బుధవారం మహిళను హత్య చేసిన నిందితుడు వాలిశెట్టి కోదండ (40)ను గురువారం అరెస్టు చేసినట్టు సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస ప్రాంతానికి చెందిన లక్ష్మీ (45) అనే మహిళతో పాత నేరస్థుడు కోదండ సహజీవనం చేస్తూ మద్యం మత్తులో కత్తితో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేసిన విషయం తెలిసిందే. నిందితుడిని అరెస్టు చేసి అనకాపల్లి అదనపు మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టుసీఐ తెలిపారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితుడిని విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఆయన చెప్పారు.

టేకు కలప స్వాధీనం



కలపతో వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్న దృశ్యం

నర్సీపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోలుగుంట నుంచి వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను స్వాధీనం చేసుకున్నట్టు నర్సీపట్నం రేంజ్ అధికారి కేవీ రాజేశ్వరరావు తెలిపారు. సాధారణ తనిఖీలలో భాగంగా బుధవారం కోటవురట్ల మండలం ఎండపల్లి దగ్గర వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 76 టేకు ముక్కలను గుర్తించామన్నారు. వీటిని నర్సీపట్నం డిపోకు తరలించినట్టు రేంజర్ తెలిపారు. కలప విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559